
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

5

బుధవారం 17 సెప్టెంబరు 2025



గరిష్ఠం 29.0
కనిష్ఠం 23.8

****

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	588.40 (307.2834)	1,62,968	1,62,968
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.30 (4.02)	4,732.95	6,019.48
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.9152 (44.0839)	87,314	1,37,548

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.240

వీరులారా వందనం



నిజాం ప్రభువు ఏలుబడిలో రజాకార్ల నిరంకుశత్వాన్ని ఎదిరించి సాగించిన మహోధృత పోరాటంలో ఉమ్మడి జిల్లాది కీలక పాత్ర. మట్టి మనుషులు ఉద్యమ దివిటీలై.. సామాన్యులే సారథులై నడిపించిన సంగ్రామం.. మహిళలతో సైతం బందూకు పట్టించిన తెలంగాణ సాయుధ పోరాటం.. ఈ పోరులో ఎందరో అసువులుబాశారు. వి మోచనం.. విద్రోహం.. విలీనం.. ఎవరే పేరుతో పిలిచినా తెలంగాణ సమాజానికి స్వేచ్ఛావాయువులను అందించిన ఈ పోరాట ఆనవాళ్లు ఉమ్మడి జిల్లాలో సజీవంగానే ఉన్నాయి.

6



ప్రైవేట్ ఆస్పత్రులపై బకాయిల భారం



పేదల వైద్యానికి ఆసరాగా ఉంటున్న ఆరోగ్యశ్రీ సేవలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచి నిలిచిపోనున్నాయి. ఏళ్లుగా కోట్ల రూపాయల బకాయిలు పెండిగ్‌లో ఉండగా, ప్రభుత్వం బిల్లులు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ ఆరోగ్యశ్రీ సేవలను ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు నిలిపివేయనున్నాయి. బకాయిల్లో కనీసం 30శాతం నిధులైనా విడుదల చేయాలని ప్రైవేట్ ఆస్పత్రులు కోరుతుండగా, సేవలు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటామని ఈ పరిస్థితికి వెంటనే పరిష్కారం చూపాలని పేదలు కోరుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి,మిర్యాలగూడ)

7

టీజీఐఐసీ ఆధీనంలోకి దండుమల్కాపురం టెక్స్‌టైల్ పార్క్



యాదాద్రి భువనగిరి చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని టెక్స్‌టైల్ పార్క్ నిర్వహణ, అభివృద్ధి బాధ్యతలు తెలంగాణ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ)కి అప్పగిస్తూ ప్రభత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు చేనేత జౌళిశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఆదేశాలు జారీచేశారు. చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో ఉన్న టెక్స్‌టైల్ పార్క్ నిర్వహణ ఇక నుంచి టీజీఐఐసీ తీసుకుంటుంది.

- (ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్ రూరల్)

ఆమె ఆరోగ్యం కోసం..



- 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' ప్రారంభం
- నేడు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో ప్రారంభం
- మెగా వైద్యశిబిరం ఏర్పాటు

ఇంటా బయట పని ఒత్తిడికి గురవుతున్న మహిళలు పోషకాహారలోపం, రక్తహీనతకు గురై పలు రకాల అనారోగ్యాలబారిన పడుతున్నారు. కుటుంబ బాగోగులను నిత్యం కనిపెట్టుకుని ఉండే మహిళలు అనారోగ్యంబారిన పడితే పిల్లల సంరక్షణ కుంటుపడటంతో మొత్తం కుటుంబమే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

- (ఆంధ్రజ్యోతి,మిర్యాలగూడ)

ఆరోగ్యవంతమైన మహిళలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్'ను జిల్లాలో మంగళవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ మేరకు జిల్లా స్థాయి అధికారులు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ చర్యలు చేపట్టనున్నారు. పోషకాహారం, ఆరోగ్య అవగాహన కోసం అంగన్‌వాడీల్లో పోషణ్ మహాన్‌తో జతచేసి ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు. ఆరోగ్యకరమైన కుటుంబాలను నిర్మించే దిశగా విస్తృత ప్రచారం కల్పించనున్నారు.

జిల్లా స్థాయి మెగా వైద్య శిబిరం

రాష్ట్ర ప్రభుత్వం 'ఆరోగ్య మహిళ.. శక్తివంతమైన కుటుంబం' కార్యక్రమం ద్వారా ఈ నెల 17న మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో జిల్లాస్థాయి మెగా వైద్య శిబిరం నిర్వహణకు ఏర్పాట్లు చేసింది. ఈఎన్‌టీ, కంటి, రక్తపోటు, దంత, మధుమేహం, క్యాన్సర్, గర్భిణులకు పరీక్షలు, రక్తహీనత, టీబీ, ఎనిమియా వంటి పరీక్షలను నిపుణులతో చేయించనున్నారు.

117 మహిళా ఆరోగ్య శిబిరాలు

ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహిస్తున్న 'ఆరోగ్య మహిళ.. శక్తివంతమైన కుటుంబం' కార్యక్రమం కింద మిర్యాలగూడ డివిజన్‌లో 35 వైద్య శిబిరాలు, జిల్లా వ్యాప్తంగా 117 వైద్య శిబిరాలను నిర్వహించనున్నారు. సబ్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్టులతో మహిళలకు, పిల్లలకు పరీక్షలు చేయించనున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరాల్లో పరీక్షలకు హాజరైన వారి పేర్లను

- మిగతా 8వ పేజీలో...

ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం..



మహిళలకు ఆరోగ్య సేవలతోపాటు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. స్థానికంగా లభించే ఆహారం గురించి తెలియజేసి ఏ రకాల పదార్థాలను తీసుకోవాలి, వేటికి దూరంగా ఉండాలనే విషయాలపై అవగాహన కల్పించనున్నారు. 10శాతం చక్కెర, వంట నూనెలను తగ్గించడం ద్వారా ఊబకాయాన్ని తగ్గించుకునే ఆలోచనలను పెంపొందించేందుకు వైద్యాధికారులు నిర్ణయించారు. రుతుస్రావ సంబంధ ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కల్పించి అందుకు అనుగుణంగా రోజువారీ మెనూలో చేపట్టాల్సిన మార్పులను వివరించనున్నారు. ఇంటికి రేషన్ పంపిణీకి సంబంధించిన సేవలను అందించేందుకు ప్రణాళికలను రూపొందించి అమలు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

రైతుల భూసమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించాలి

రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి సుధాకర్‌రెడ్డి



రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో పాల్గొన్న రెవెన్యూ, అటవీశాఖ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, జానారెడ్డి, తదితరులు

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పేద రైతులు ఎంతోకాలంగా సాగు చేసుకుంటున్న భూములపై వారికి హక్కులు కల్పించే అంశంలో సంబంధిత అధికారులు మానవీయ కోణంలో పరిష్కరించేలా చూడాని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రెవెన్యూ పైలట్ ప్రాజెక్టుపై మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డితో పాటు అటవీ, దేవాదాయశాఖమంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూశాఖ మంత్రి మాట్లాడుతూ, చిన్న సమస్యలను సాకుగా చూపించి రైతుల సమస్యలను జఠిలం చేయవద్దని అటవీశాఖ అధికారులకు సూచించారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో సుమారు 50 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న భూములపై గిరిజనులపై హక్కులను కల్పించే అంశంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. అయితే వివిధ నిబంధనలను చూపుతూ అటవీశాఖ అధికారులు కొర్రీలు పెడుతున్నారని, ఈ అంశంపై రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు సమన్వయంతో పనిచేసి వీలైనంత త్వరగా రైతుల సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

4వేల మందికి పట్టాలు

పైలట్ ప్రాజెక్టులో భాగంగా నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని తిరుమలగిరి(సాగర్) మండలాన్ని ఎంపిక చేసి గత ఆరు నెలలకు పైగా భూసర్వే నిర్వహించినట్టు మంత్రి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ క్రమంలో మండలంలో 235 సర్వే నెంబర్లను ఎంపిక చేశామని, 23వేల ఎకరాలను క్షేత్రస్థాయిలో సర్వే చేయగా, అందులో 12వేల ఎకరాలు ప్రభుత్వ భూమిగా గుర్తించామన్నారు. అందులో 8వేల ఎకరాలు సాగుకు అనుకూలంగా ఉన్నట్టు, 4వేల ఎకరాలకు రైతులు పట్టాదారు పాస్‌పుస్తకాలు పొంది సాగులో ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే మిగిలిన 4,037 ఎకరాలకు సంబంధించి పేద రైతులు భూములను సేద్యం చేసుకుంటున్నారని, త్వరలోనే వారికి పట్టాదారు పాస్‌పుస్తకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. మండలంలో సర్వే చేస్తున్న క్రమంలో 2,936 ఎకరాలకు సంబంధించి 3,069 మంది వద్ద బోగస్ పాస్‌పుస్తకాలు ఉన్నట్టు గుర్తించి వాటిని రద్దు చేయడంతోపాటు వారికి రైతుభరోసా, రైతుబీమా తదితర పథకాలు రాకుండా చూశామన్నారు. అదేవిధంగా సర్వేలో 7వేల ఎకరాల్లో అటవీ భూమిని గుర్తించామని, ఈ భూములకు సంబంధించి కూడా రెవెన్యూ, ఫారెస్ట్ అధికారుల సమన్వయంతో వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించి వాటిని సేద్యం చేస్తున్న రైతులకు కూడా న్యాయం చేస్తామని పేర్కొన్నారు. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, రెవెన్యూశాఖ కార్యదర్శి డీఎస్.లోకేష్‌కుమార్, పీసీసీఎఫ్ డాక్టర్ సి.సువర్ణ, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్‌తోపాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి



నల్లగొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిజాం రజాకార్ల కబంధ హస్తాల నుంచి హైదరాబాద్ సంస్థానం విడుదలైన రోజు సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఎంఐఎం పార్టీకి భయపడి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. కేవలం హిందూ పండుగలకు ఆంక్షలు విధిస్తూ తెలంగాణ విమోచన దినోత్సవం అనే పేరు చెప్పడానికి కూడా భయపడిన ప్రభుత్వం 'ప్రజా పాలన' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించడం దురదృష్టకరమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఐఎం పార్టీకి కొమ్ముకాయడమే పనిగా పెట్టుకొని హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఎందుకు నిర్వహించడం లేదో ప్రభుత్వం ప్రజలకు వివరించాలన్నారు.

పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించేలా సంబంధిత అధికారులు పనిచేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీకి స్థానిక పోలీస్‌స్టేషన్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ, వివిధ సమస్యలపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా ప్రవర్తించాలని, వారి సమస్యలను సానుకూలంగా విని పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా మండలంలో దొంగతనాలు జరగకుండా నిరంతరం గస్తీ నిర్వహించి శాంతిభద్రతలు కాపాడాలన్నారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రికార్డులు పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఐ వీరశేఖర్‌ను ఆదేశించారు. నూతన స్టేషన్ నిర్మాణానికి తగిన స్థలం గురించి ఆరాతీశారు. అదేవిధంగా రిసెప్షన్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఉమెన్ కానిస్టేబుల్ ఇంద్రజతో పాటు హెడ్‌కానిస్టేబుల్ అలీఅహ్మద్, కానిస్టేబుళ్లు అనిల్, రవికుమార్, సాయికుమార్, హేమంత్‌కుమార్, నాగరాజును అభినందించారు. ఆయన వెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ శ్రీనునాయక్, ఎస్ఐ వీరశేఖర్, తదితరులు ఉన్నారు.

నేడు 'ప్రజా పాలన' దినోత్సవం

నల్లగొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ 'ప్రజా పాలన' దినోత్సవాన్ని నిర్వహించేందుకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. బుధవారం వేడుకల్లో భాగంగా ఉదయం 10గంటలకు రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి ప్రసంగిస్తారు. 10.30గంటలకు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

ముస్తాబైన పోలీస్ పరేడ్ గ్రౌండ్



పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

డీపీవో వెంకయ్య



అంతంపేట పంచాయతీ కార్యాయలంలో బ్లీచింగ్ పౌడర్‌ను పరిశీలిస్తున్న డీపీవో వెంకయ్య

గట్టుప్పల్, మునుగోడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పంచాయతీ కార్యదర్శులను డీపీవో వెంకయ్య ఆదేశించారు. మంగళవారం గట్టుప్పల్ మండల పరిధిలోని అంతంపేట, వెల్మకన్నె గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలను మునుగోడు మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్, గ్రామపంచాయతీ, ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాన్ని తనిఖీ చేశారు. అంతంపేట, వెల్మకన్నెలో రికార్డులతో పాటు, స్టోర్ రూమ్‌లో ఉన్న బ్లీచింగ్ పౌడర్‌ను పరిశీలించారు. రికార్డులు సరిగా లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కార్యదర్శులు సమయపాలన పాటించకుంటే, పని విధానంలో మెరుగు కనిపించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మునుగోడు హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య, నిర్వహణ తీరును వార్డెన్ వెంకన్నను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి భోజన మెనూపై ఆరాతీశారు. గ్రామపంచాయతీ, పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డికి సూచించారు. ఆయన వెంట గట్టుప్పల్ ఎంపీడీవో వసంత లక్ష్మి ఉన్నారు.

నేడు సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ జిల్లా కేంద్రంలోని సుభాష్ సెంటర్లో నిర్వహిస్తామని, ఈ కార్యక్రమానికి సీపీఎం పొలిట్ బ్యూరో మాజీ సభ్యురాలు బృందా కరత్ హాజరవుతారని సీపీఐఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర నేత ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక దొడ్డికొమరయ్య భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 40 కేంద్రాల్లో అమరుల స్థూపాల వద్ద నివాళులర్పించి ర్యాలీలు నిర్వహించామన్నారు. వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, నాయకులు చెరుపల్లి సీతారాములు, తదితరులు పాల్గొంటారని తెలిపారు. విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున, నారి ఐలయ్య, చినపాక లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వీరులారా వందనం

» తెలంగాణ సాయుధ పోరాటానికి అడ్డాగా నిలిచిన ఉమ్మడి నల్లగొండ జిల్లా » అమరుల స్మతిగా గ్రామాల్లో స్థూపాలు



తిరగబడిన గుండ్రాంపల్లి

రజాకార్ల నిరంకుశత్వాన్ని ఎదిరించి సాగించిన పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటం. సామాన్యులే సారథులై నడిపించిన సంగ్రామం. నిర్బంధాలను లెక్కచేయకుండా ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడిన వీరులు ఎందరో. సాయుధ పోరాటానికి నాంది పలికిన ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆ ఆనవాళ్లు నేటికీ ఉన్నాయి. అమరుల త్యాగనీరతికి సాక్షిగా నిలిపిన స్థూపాలెన్నో. ఓ కవి చెప్పినట్లు పత్రీ గ్రామంలో 'తొవ్వా పువ్వుల తీరుఅమరులుంటారు'.


- (ఆంధ్రజ్యోతి-చిట్యాలరూరల్)

దేశానికి 1947 ఆగస్టు 14 అర్ధరాత్రి దాటాక స్వాతంత్రం వచ్చినా తెలంగాణ ప్రాంతంలో నిజాం పాలనే కొనసాగింది. వారి అనుచరుల ఆగడాలు మితిమీరిపోయాయి. వారి కబంద హస్తాల నుంచి బయటపడేందుకు ఎదురొడ్డి తరిమికొట్టిన చరిత్ర నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామస్థులది. సూర్యాపేట తాలుకా వర్ధమానుకోటకు చెందిన సయ్యద్ మగ్బూల్ నిజాంసైన్యంలో పనిచేస్తున్న సమయంలో భార్య మృతితో ముగ్గురుపిల్లలతో గుండ్రాంపల్లికి వచ్చి స్థిరపడ్డాడు. ఏపూర్ గ్రామంలో గుమ్మి బక్కారెడ్డి వద్ద పనిచేసిన కొంతకాలానికి మజ్లిస్ ఇత్తైహదుల్ ముసల్మాన్ అనే సంస్థలో చేరి దళ నాయకుడిగా మారాడు. తన దళ సభ్యులతో కలిసి చుట్టుపక్కల గ్రామాల్లో దోపిడీలు, దౌర్జన్యాలు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడేవాడు. ఈ క్రమంలో అతడికి అడ్డు వచ్చిన వారిని హతమార్చేవాడు. మగ్బూల్ తన నివాసాన్ని నిర్మించుకునేందుకు తీసిన బునాదిలో ఇద్దరు నిండు గర్భిణులను చంపి పూడ్చిపెట్టాడు. అదేవిధంగా ప్రజలను, కమ్యూనిస్టు దళ సభ్యులను, గుర్తుతెలియని వందలాది మందిని నిర్ధాక్షణ్యంగా చంపి మసీదు సమీపంలోని చేదుడు బావిలో పడేసేవాడు. అతడి చర్యలకు చిన్నకాపర్తికి చెందిన దొర పాశం పుల్లారెడ్డితో పాటు మరికొందరు సహకరించేవారు. దీంతో రెండు కమ్యూనిస్టు దళాలు పుల్లారెడ్డి ఆచూకీ తెలుసుకుని వెళ్లి తలనరికి రజాకార్ల దళం బలితీసుకున్న కొంపెల్లి గ్రామంలోని పోరాటయోధుడు వీరమళ్ల వెంకన్న సమాధి వద్ద ఖననం చేసింది. మగ్బూల్‌ను మట్టుపెట్టాలనే లక్ష్యంతో కోదండ రామిరెడ్డి దళం వెంకటరామారావు నాయకత్వంలో 1948 జూన్ 19న మగ్బూల్ నివాసం మీద దాడి చేసి చాలామంది రజాకార్లను చంపేసింది. ఈ దాడి సమయంలోనే మగ్బూల్ పరారయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు అతడి నివాసానికి నిప్పంటించారు. అదే క్రమంలో మగ్బూల్‌కు సహకరించిన వెలిమినేడుకు చెందిన గడ్డం రామయ్య, సప్పిడి రామయ్యలను హతమార్చారు.

అమరుల స్థూపం

మగ్బూల్ చేతిలో హతమై చేదుడుబావిలో పడవేయబడిన 26 మందిని గుర్తించారు. ఆ బావిపైనే 1993 జూన్ 4వ అమరవీరుల స్థూపాన్ని నిర్మించారు. 2010లో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా స్థూపాన్ని తొలగించబడగా రహదారి పక్కన ఏపూర్ గ్రామానికి వెళ్లే దారిలో మరో స్మారకస్థూపాన్ని నిర్మించారు.

నమస్కారం పెట్టలేదని కొట్టారు



మగ్బూల్ ఇంటి ముందు వెళ్తే నమస్కారం పెట్టకుంటే సిబ్బంది చెంపలపై కొట్టారు. ఐదేళ్ల వయసులో ఒకసారి తెలియక నమస్కారం పెట్టలేదు. మగ్బూల్ పిలిచి నమస్కారం ఎందుకు పెట్టలేదని కొట్టారు. పెద్దలయినా, చిన్నవారైనా సరే ఆయన ఇంటి ముందు నుంచి వెళ్లేందుకు భయపడేవారం. అతడు ఎంతోమందిని కొట్టి చంపి బావిలో వేసేవాడు. ఎదురుదాడులు మొదలయ్యాయని తెలిసి పరారయ్యాడు.

- నమ్ముల బుచ్చయ్య, గుండ్రాంపల్లి

(ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

మోత్కూరులో నిజాం కాలం నుంచే పోలీస్‌స్టేషన్ ఉంది. ఎస్‌ఐ గడ్డం అమీన్ దొరలకు, రజాకార్లకు ఏజెంటుగా ఉంటూ అందరినీ హింసించేవాడు. అతడి అరాచకాలపై కాచం కృష్ణమూర్తి, కట్కూరు రామచంద్రారెడ్డి, దూదిపాల చిన్నసత్తిరెడ్డి, కూరెల్ల సంజీవరెడ్డి తదితరులు చైతన్యం రగిలించారు. అదేవిధంగా చుట్టుపక్కల గ్రామాల్లో తెలంగాణ సాయుధ పోరాట దళాలు ఏర్పడ్డాయి. మోత్కూరు మండలం కొండగడప దేశ్‌ముఖ్ గడిపై దాడి విషయం తెలుసుకున్న దేశ్‌ముఖ్ ముందుగానే హైదరాబాద్ వెళ్లిపోయాడు. 1947లో సింగారం రాజయ్య, గాదె రాజు నల్లగొండ కోర్టుకు వెళ్లి వస్తుండగా రజాకార్లు బిక్కేరు వాగులో అడ్డగించి వారితోనే గుంత తీయించి అందులోనే వారిని సగం పూడ్చి కాల్చి చంపారు. మోత్కూరు పాత తాలూకా పరిధిలోని సదర్శాపురం గ్రామంలో ఓ భూస్వామి తీగల లచ్చయ్యను అతడి కుమారుడు శివయ్య సమాచారం చెప్పాలని కొట్టగా చెప్పకపోవడంతో ఊరి జనం చూస్తుండగానే కాల్చి చంపి అక్కడే ఉన్న ఎడ్ల బండిపై వేసి తగలబెట్టారు. గ్రామ భూస్వామి ఆగడాలను కొరియర్‌గా పనిచేస్తున్న గ్రామానికి చెందిన పర్రెపాటి నర్సయ్య దళనాయకులు నారాయణరెడ్డి, నంద్యాల శ్రీనివాస్‌రెడ్డికి తెలిపారు. దీంతో వారి దళం మోత్కూరు పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసి అక్కడ తలదాచుకున్న భూస్వామిని కాల్చి చంపింది. అదే సమయంలో ప్రజలను దోచుకుంటున్న దస్తగిరి అనే పోలీసును కూడా చంపారు. అనంతరం ఎస్‌ఐ గడ్డం అమీన్ సాయుధ పోరాట దళాలు అంతమొందించాయి. సాయుధ పోరాటంలో మాజీ ఎమ్మెల్యే గుర్రం యాదగిరెడ్డి, సుద్దాల హన్మంతు, కొప్పుల నర్సింహారెడ్డి, దూదిపాల పెద్ద సత్తిరెడ్డి, చల్ల లింగయ్య లాంటి వారెందరో పాల్గొన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట దళాలకు ఈ ప్రాంత ప్రజలు ఎంతో వెన్నుదన్నుగా నిలిచారు.

విజయానికి గుర్తుగా దసరా రోజు జెండాల ఎగురవేత

గుండాల మండలం పల్లెపహాడ్ గ్రామంపైకి తెలంగాణ సాయుధ పోరాట దళాలను పట్టుకోవాలని పోలీసులు, రజాకార్లు రెండుసార్లు ప్రయత్నించారు. మూడోసారి పోలీసులు, రజాకార్లు రాగా, అదే గ్రామానికి చెందిన చాకలి అయిలయ్య దళం స్థానిక బురుజుపై ఉండి కాల్పులు జరిపింది.అయితే సెప్టెంబరు 17న హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనం కాగా ఆ తర్వాత అక్టోబరులో వచ్చిన దసరా పండగ రోజు అప్పటి సీపీ ఐ నాయకులు ఆ బురుజుపై జెండా ఎగురవేసి విజయోత్సవం చేసుకున్నారు. ఆ ఆనవాయితీ ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. అప్పుడు ఒక్క సీపీఐ మాత్రమే అక్కడ జెండా ఎగుర వేయగా ఇప్పుడు సీపీఐతోపాటు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు కూడా జెండాలు ఎగురవేస్తున్నాయి.

ప్రజా ఆయుధమైన కోదండరాంరెడ్డి



(ఆంధ్రజ్యోతి-బీబీనగర్): తెలంగాణ సాయుధ పోరాటయోధుల్లో యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన కొమ్మిడి కోదండరాంరెడ్డి ఒకరు. భూస్వామ్య కుటుంబానికి చెందిన ఆయన 1941 నుంచి ఆంధ్రమహాసభ్యుడిగా కార్యకర్త, కమ్యూనిస్టు నాయకుడిగా ఎదిగి అత్రాఫ్ పల్దాజిల్లాల నిజాం అనుచరులకు సింహస్వప్నంగా మారారు. 1944లో 80మందిలో జైత్రయాత్ర దళాన్ని ఏర్పాటు చేసి వారితో రజాకార్ల క్యాంపులపై దాడులు చేయించారు. వెంకిర్యాల గ్రామంలో తమ దళసభ్యులను పోలీసులకు అప్పగించినందుకు నుంతనపల్లిలో 60మంది రజాకారులపై మూకుమ్మడిగా దాడి చేసి కోదండరాంరెడ్డి ప్రతీకారం తీర్చుకున్నారు. దీంతో 1948 జూలైలో ఖాసీం రజ్వీ తమ్ముడు తయ్యబ్ రజ్వీ నాయకత్వంలో 150మందికి పైగా రజాకార్లు బ్రాహ్మణపల్లి గ్రామం పై దాడి చేసి కోదండరాంరెడ్డి ఇంటికి నిప్పుపెట్టారు. ఈ అకృత్యాలను సహించలేని ఆయన 150మంది దళసభ్యులు ప్రజల సహకారంతో దాడిచేసిన వారిని మట్టుపెట్టారు. 1949 జూన్ 6న బ్రాహ్మణపల్లి గ్రామశివారు మంగలోనిబావి వద్ద దళ సభ్యులతో భోజనం చేసేందుకు సిద్ధమవుతున్న కోదండరాంరెడ్డిని దొంగచాటుగా వచ్చిన రజాకార్లు కాల్చి చంపారు. 27ఏళ్ల వయస్సులోనే కోదండరాంరెడ్డి వీరమరణం పొందారు.

రజాకార్లను తరిమికొట్టిన రావులపెంట

నిజాం అనుచరులను ఎదురించడంలో నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం తోపుచర్ల ఫిర్కాలోని రావులపెంట దళం ప్రధానపాత్ర పోషించింది. అక్రమ వసూళ్లు, హత్యలకు, అత్యాచారాలకు విసిగిన ప్రజలు నిజాం అనుచరులపై తిరగబడ్డారు. అదేసమయంలో ఉమ్మడి వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామంలో పోలీస్‌స్టేషన్ కేంద్రంగా రావులపెంట, పాములపాడు కేంద్రాల్లో అవుట్‌పోస్టులు ఏర్పాటుచేసి నిజాంకు వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై అణచివేత చర్యలు చేపట్టారు.

- (ఆంధ్రజ్యోతి-వేములపల్లి)

రావులపెంటలో భూస్వామ్య కుటుంబంలో జన్మించిన చల్లా సీతారాం రెడ్డి 1939లో ఉపాధ్యాయుడిగా పాఠశాలలో ఉద్యమ పాఠాలు బోధించేవారు. దేవులపల్లి వెంకటేశ్వర్‌రావుతో పరిచయంతో ఆయనపై పోలీసుల ఒత్తిళ్లు పెరిగాయి. 1946లో ఉద్యోగాన్ని వదులుకుని సాయుధ పోరాటంలోకి వెళ్లారు. గ్రామమే కేంద్రంగా నారాబోయిన నరసయ్య, గుంటివెంకట నర్సయ్య, గట్టికొప్పుల రాంరెడ్డితో కలిసి పోరాటాలు చేశారు. గ్రామంలోని కోట బురూజు కేంద్రంగా ఉద్యమ కార్యాచరణ చేసి రావులపెంట, పాములపాడు, ఆమనగల్లు గ్రామాల్లో దళాలను ఏర్పాటు చేశారు. ఈ దళాలు మూకుమ్మడిగా దాడి చేసి రజాకార్లను తరిమికొట్టాయి. ఈ పోరాట వ్యూహరచన చేసిన వారిలో నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి, భీమిరెడ్డి నరసింహారెడ్డిలు ఉన్నారు. పోరాటయోధుల సమాచారం కోసం రజాకార్లు దొండవారిగూడెం గ్రామంలో రేగిచెట్ల కంపను కుప్పగా చేసి కొందరిని అందులో దహనం చేశారు. రావులపెంట, పాములపాడు, తడకమళ్ల గ్రామాల్లో రజాకార్లను పాములపాడు, రావులపెంట దళాలు ఎదురించి పోరాడాయి. హోరాహోరీగా కాల్పులు జరగడంతో నిజాం సైన్యం వెనుదిరిగింది. అనంతరం పోలీసు నాఖాపై దాడి కాల్పుల్లో సబ్బు లింగారెడ్డి, బత్తిని వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి వీరమరణం పొందారు.



సాయుధ రైతాంగ పోరాటానికి సూత్రదారులు చల్లా సీతారాంరెడ్డి అని గుర్తించి పట్టుకోవడానికి నిజాం సైన్యం ప్రయత్నించింది. పోరాట యోధులు తిరగబడడంతో పారిపోయారు. నాటి తోపుచర్ల ఫిర్కాలో నిజాం నవాబును ఎదురించిన ఘనత వేములపల్లి మండలంలోని రావులపెంట దళానికి దక్కింది.




చరిత్ర మరువని రోజు సెప్టెంబరు 17



తెలంగాణ చరిత్ర మరువని రోజు 1948 సెప్టెంబరు 17. అది నిజాం నిరంకుశత్వం తలవంచిన రోజు. రజాకార్ల ఆగడాలు అంతమైన రోజు. నాటి రెండు కోట్ల మంది తెలంగాణ ప్రజల హృదయాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడిన పర్వదినం. ఈ నేలపై త్రివర్ణపతాకం ఎగిరిన రోజు. నిజాం రాచరిక పాలన ముగిసి, హైదరాబాద్ రాజ్యం భారత ప్రభుత్వంలో కలిసిన ఆ రోజు వెనుక అనేక ఘటనలు ఉన్నాయి. అందులో కొన్ని అంశాలు, ప్రముఖుల అభిప్రాయాలతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

- హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి)



ఈ ఘట్టానికి ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ

తెలంగాణ చరిత్రలోనే మరచిపోలేని సెప్టెంబరు 17 ఘట్టంలో ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ 'మజ్లిస్ ఎ ఇత్తేహాద్ ఉల్ ముస్లిమీన్' నాయకుడు. ఆయన స్వస్థలం మరఠ్వాడాలోని ఉస్మానాబాద్ జిల్లా లాతూర్. అలీగఢ్‌లో న్యాయశాస్త్రం అభ్యసించిన అనంతరం హైదరాబాద్‌లో కొంతకాలం వకీలు మహమ్మద్ అలీ ఫాజిల్ దగ్గర సహాయకుడిగా పనిచేశాడు. తర్వాత సొంతూరుకు వెళ్లిన అతను మజ్లిస్ స్థానిక నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందాడు. యావదాస్తిని సంఘానికి రాసిచ్చి నాయకుల మనసులో ప్రత్యేక స్థానం సంపాదించాడు. కొద్దిరోజులకే సంస్థ పగ్గాలు చేపట్టాడు. సమయస్ఫూర్తి, వాగ్ధాటితో సామాన్యులను ఆకట్టుకున్న రజ్వీ నిజాం ప్రభుత్వాన్ని శాసించే స్థాయికి ఎదిగాడు. రజాకార్ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. హింసాత్మక ఘటనలకు కారకుడయ్యాడు. పోలీసు చర్య అనంతరం రజ్వీని భారత సైన్యం అరెస్టుచేసి తిరుమలగిరి సైనికకారాగారంలో నిర్బంధించింది. 1957, సెప్టెంబరు11న విడుదలయ్యాడు. అదే నెల18న నగరం నుంచి ముంబైకు, అక్కడి నుంచి పాకిస్థాన్‌కు వెళ్లిపోయాడు. కరాచీలో ఒక అనామకుడిగా జీవనం సాగిస్తూ న్యాయవాదిగా ప్రాక్టీసు మొదలుపెట్టాడు. ఒకనాడు ఈ నేలను శాసించాలనుకున్న ఇత్తేహాదుల్ సారథి 1970, జనవరి15న ఓ సాధారణ వ్యక్తిగా కన్నుమూశాడు.

భయంతో ఆస్తులమ్మారు



పోలీసు యాక్షన్‌కు వారం ముందు 'బక్రీదుకు గొర్రెలను కాదు, హిందువుల తలలు నరుకుతాం. వాళ్ల రక్తంతో హోలి ఆడతాం' అని రజాకార్ నాయకుడు ఖాసీం రజ్వీ ప్రకటించినట్లుగా నగరమంతా వదంతులు వ్యాపించాయి. దాంతో హిందువులంతా భయంతో ఆస్తిపాస్తులు అమ్ముకొని బతికినన్నాళ్లు అయినా ఆనందంగా జీవించాలని విందులు చేసుకున్నారు. అదే సమయంలో భారత సైన్యం ప్రవేశించడంతో నిజాం లొంగిపోయాడని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. యుద్ధ ట్యాంకులు, వాహనాలకు పూలమాలలు వేసి, భారత జవానులకు లడ్డూలు తినిపిస్తూ సంబురాలు చేసుకున్నారు. ముస్లింలంతా రజాకార్లు కాదు. ఆ సమయంలో రజాకార్ల దాడినుంచి ఎంతోమంది హిందువులను ముస్లింలు కాపాడారు. ఈ విషయాలన్నీ ప్రత్యక్ష సాక్షి మా అక్కచెప్పగా నాకు తెలిశాయి.

- పరవస్తు లోకేశ్వర్, నగర చరిత్ర పరిశోధకుడు

నిజాం ప్రధానిమీదా రజాకార్ల దాడి

నిజాం నిరంకుశ పాలనలో సామాన్యుల మానప్రాణాలను హరించిన రజాకార్లు నిజాం ప్రధాని మీదా దాడి చేయడం కొంత మందికే తెలుసు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని ఓ ఆస్పత్రి ఆవరణలో తలెత్తిన ఘర్షణలో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాలన్న కాంక్షతో కొంత మంది రజాకార్లు ఆనాటి ప్రధాని అధికారిక నివాసం షా మంజిల్(ప్రస్తుతం రాజ్‌భవన్)ను ముట్టడించారు. లోపల గృహోపకరణాలకు నిప్పుపెట్టారు. అంతటితో ఆగక ప్రధానమంత్రిపై సైతం దాడికి పాల్పడ్డారని మందుముల నరసింహారావు జ్ఞాపకాల్లో ప్రస్తావించారు.

దక్కన్ రేడియోలో స్వాతంత్ర్య ప్రకటన

భారత ఆర్మీ 1948, సెప్టెంబరు18న నగరానికి చేరింది. అంతకు ఒకరోజు ముందు రోజు సెప్టెంబర్17న ఖాసీం రజ్వీ హైదరాబాద్‌లో నరమేధానికి వ్యూహం పన్నాడు. ఈ విషయం తెలిసి ఉస్మానాబాద్ కలెక్టర్ మొహమ్మద్ హైదర్ ఆనాటి నిజాం పోలీసు ఉన్నతాధికారి నవాజ్ దీన్‌యార్‌జంగ్ దగ్గరకు పరుగుతీశాడు. ఇరువురు ఫోన్‌ద్వారా రజ్వీకి నచ్చజెప్పి కల్లోలాన్ని ఆపించారు. ఈ విషయాన్ని మొహమ్మద్ హైదర్ జ్ఞాపకాల్లో రాశారు. అంతకు ముందురోజే సైన్యాధ్యక్షుడు ఎల్.ఇద్రూస్ నిజాంను కలిసి సైన్యాన్ని ప్రతిఘటించడం వల్ల మరింత ప్రాణ నష్టం మినహా మరేమీ లేదని విన్నవించాడు. దీంతో సెప్టెంబరు17న మొదట ఖాసీం రజ్వీ ఖైరతాబాద్‌లోని దక్కన్ రేడియో ద్వారా తన ఓటమిని అంగీకరించాడు. ఆ తర్వాత కేఎంమున్షీతో కలిసి దక్కన్ రేడియోకు చేరుకున్న నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్... భారత సైన్యాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కొన్ని వందల ఏళ్ల రాచరిక పాలన నుంచి ఈ నేలకు స్వాతంత్ర్యం సిద్ధించింది. ప్రజలంతా ఆనందోత్సాహాలతో సంబురాలు చేసుకున్నారు. నగర వీధుల్లో జాతీయ జెండా ఎగరేశారు.

పోరాట చరిత్రను వక్రీకరించద్దు



నిజాం వ్యతిరేక, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రతో సంబంధం లేని వాళ్లు విమోచనం అంటూ రాద్ధాంతం చేయడంసరికాదు. ఆ మహత్తర పోరాటంలో ప్రాణాలకు తెగించి మరీ పోరాడిన మేమంతా బతికుండగానే ఈ నేల చరిత్రను వక్రీకరిస్తున్నారు. త్యాగాలను అవమానిస్తున్నారు. కొత్త రాజకీయ ఎత్తుగడలో భాగంగానే వాళ్లు నాలుగేళ్లుగా విమోచనం పాటెత్తుకున్నారు. ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టుల సాయుధపోరాటం వల్లే హైదరాబాద్ సంస్థానం భారత ప్రభుత్వంలో విలీనమైందనేది వాస్తవం.

- కందిమళ్ల ప్రతాపరెడ్డి, కార్యదర్శి, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్

కమ్యూనిస్టులకు ఆయుధాలు అందించా



నాది భూస్వామ్య కుటుంబమే అయినా, నిజాం వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నా. అప్పట్లో హెచ్ఎస్‌సీ ప్రీఫైనల్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులనే వార్షిక పరీక్షలకు పంపేవారు. దీనికి వ్యతిరేకంగా ఆల్ హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ పెద్ద ఉద్యమమే లేవనెత్తింది. అందులో నేనూ పాల్గొన్నా. అలా మగ్దూం, జావెద్ రజ్వీ, సీహెచ్ రాజేశ్వరరావు, రాజ్‌బహదూర్ గౌర్ లాంటి కమ్యూనిస్టు నాయకులతో పరిచయం ఏర్పడింది. నిజాం వ్యతిరేకపోరాటంలో కమ్యూనిస్టు పార్టీ నాయకులకు ఎన్నోసార్లు మందుగుండు సామాగ్రి, తుపాకీలు లాంటి ఆయుధాలు రహస్యంగా అందించా. కొన్నాళ్లు రహస్య జీవితం గడిపా. కమ్యూనిస్టు పార్టీ చైతన్యంతో వారసత్వంగా వచ్చిన వందలఎకరాల భూమిని పంచాను.

- మొహ్మద్ ఖాజా మొయినుద్దీన్, నిజాం వ్యతిరేక పోరాటయోధుడు, 99ఏళ్లు

బీ.వెల్లెంల రిజర్వాయర్‌కు నీటి విడుదల



బీ.వెల్లంల రిజర్వాయర్‌లోకి చేరుతున్న నీరు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంల ఉదయసముద్రం ఎత్తిపోతల పథకం రిజర్వాయర్‌కు మంగళవారం నుంచి నీటి విడుదల ప్రారంభమైంది. పానగల్‌లోని ఉదయసముద్రం నుంచి నీటివిడుదల నిలిపివేయడంతో పాటు ఉన్న నీటిని పలు గ్రామాల్లో సాగునీటి అవసరాలను కాల్వలకు విడుదల చేయడంతో రిజర్వాయర్‌లో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకి చేరాయి. అయితే పానగల్ రిజర్వాయర్ కట్ట రివిట్‌మెంట్ ఓ చోట దెబ్బతిన్న కారణంగా కొన్నిరోజులు బీ.వెల్లెంల రిజర్వాయర్‌కు నీటి సరఫరా జరగలేదు. తాజాగా నాగార్జునసాగర్ క్రస్ట్‌గేట్లు పూర్తిస్థాయిలో ఎత్తివేయడంతో పాటు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బీ.వెల్లెంల ఉదయసముద్రం ప్రాజెక్టు పంప్‌హౌజ్‌లో ఉన్న రెండు మోటార్లలో మంగళవారం మధ్యాహ్నం నుంచి ఒక మోటారును ఆన్ చేసి నీటి విడుదలను ప్రారంభించారు. రిజర్వాయర్ (0.302 టీఎంసీ) పూర్తిస్థాయిలో నిండే వరకు పంపింగ్ కొనసాగుతుందని ప్రాజెక్టు ఏఈ తెలిపారు.

ఎరువుల విక్రయాలను నమోదుచేయాలి



చిట్యాలలో ఆగ్రో రైతుసేవాకేంద్రంలో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జేడీఏ శ్రవణ్‌కుమార్

చిట్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎరువుల విక్రయాల వివరాలను దుకాణదారులు ఎప్పటికప్పుడు ఈపోస్ మిషన్‌తో స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని నల్లగొండ జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా చిట్యాలలోని ఆగ్రో రైతుసేవాకేంద్రం, మన గ్రోమోర్ కేంద్రాలను ఆయన పరిశీలించి, మాట్లాడారు. యూరియా, ఇతర ఎరువులను ప్రభుత్వ ధరకు మించి విక్రయించవద్దని, రోజువారీ ఎరువుల లభ్యతను బోర్డుపై ప్రదర్శించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే దుకాణదారులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో పగడిమర్రి గిరిబాబు పాల్గొన్నారు.

దాడి కేసులో ముగ్గురు రిమాండ్

చివ్వెంల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : భూతగాదాల నేపథ్యంలో మహిళపై దాడి చేసిన ఘటనలో ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట జిల్లా చివ్వెంల ఎస్‌ఐ మహేశ్వర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఎంజీనగర్‌తండాకు చెందిన రత్నావత్ జానమ్మపై ఈ నెల 10న భూ తగాదాలను మనసులో పెట్టుకొని అదే గ్రామానికి చెందిన రత్నావత్ మహేష్, రత్నావత్ రవి, రత్నావత్ శ్రీను కలిసి దాడిచేశారు.ఈ ఘటనపై రత్నమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. దాడికి పాల్పడిన ముగ్గురిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి జ్యుడిషియల్ రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు.

ఎరువుల దుకాణం సీజ్, కేసు నమోదు

మద్దిరాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్న సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలకేంద్రంలోని స్వర్ణ ఎరువుల దుకాణాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఏవో అనిషారోహి తెలిపారు.మంగళవారం ఆమె మాట్లాడుతూ దుకాణ యజమాని యూరియా బస్తా రూ.266ఉండగా రూ.320విక్రయించినట్లు తెలిపారు.యూరియా బస్తాతో పాటు పోటాష్ తీసుకోవాలని రైతులను ఇబ్బందులకు గురిచేసినట్లు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతులు ప్రకారం దుకాణాలు నిర్వహించాలన్నారు. లేకుంటే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎనిమిది మంది బైండోవర్

మర్రిగూడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాత్రి వేళలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది మందిని గుర్తించి తహసీల్దార్ వద్ద మంగళవారం బైండోవర్ చేసినట్లు సీఐ దూది రాజు తెలిపారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని చర్లగూడెం రిజర్వాయర్ నుంచి వెంకేపల్లి, వెంకేపల్లి తండా, చర్లగూడెం గ్రామాల పరిధిలో రాత్రి వేళలో ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. విచారించగా ఇసుకను తరలిస్తున్నట్లు నిర్ధారణ అయ్యిందని సీఐ రాజు అన్నారు. దీంతో ఎనిమిది మందిని గుర్తించి వారిని మర్రిగూడ తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు. అనుమతి లేకుండా రాత్రి వేళలో అక్రమంగా ఇసుక తరలిస్తే రూ.లక్ష జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



సత్యనారాయణ మృతదేహం

మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడు స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన సటి సత్యనారాయణ(75) కిరాణదుకాణం వద్దకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా సోమవారం రాత్రి నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై వాడపల్లి వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం నల్లగొండ జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. సత్యనారాయణ మనుమరాలు మందడి హరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపారు.

బస్సు ఎక్కేందుకు వెళ్తుండగా



విజయ(ఫైల్)

కొండమల్లేపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మోపెడ్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో మహిళ మృతి చెందింది. ఈ ఘటన నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలో మంగళవారం జరిగింది. పీఏపల్లి మండలానికి చెందిన సంకు లింగారెడ్డి తన అక్క పాశం విజయ(42)ను హైదరాబాద్‌కు బస్సులో పంపించేందుకు కొండమల్లేపల్లికి మోపెడ్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని చిన్నఅడిశర్లపల్లి సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకోగానే సాగర్ నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న కారు వెనక నుంచి కారు లింగారెడ్డి మోపెడ్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో పాశం జయమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను 108 వాహనంలో చికిత్స నిమిత్తం దేవరకొండ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనలో గాయాలపాలైన లింగారెడ్డిని చికిత్స నిమిత్తం దేవరకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విజయ భర్త జైపాల్‌రెడ్డి హైదరాబాద్‌లో పెయింటింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా ఈ ఘటనకు సంబంధించి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

టీజీఐఐసీ ఆధీనంలోకి

..దండుమల్కాపురం టెక్స్‌టైల్ పార్క్



కంపచెట్లతో నిండిన సీఎఫ్‌సీ భవనం

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధి బాధ్యతలను టీజీఐఐసీ(తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్)కి అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ సొసైటీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. రెండు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచని టెక్స్‌టైల్ పార్క్, గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ తరహాలో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. ఇక నుంచి పార్క్‌లో చేనేత యూనిట్లతోపాటు ఇతర చిన్న తరహా పరిశ్రమలు స్థాపించవచ్చు.

తెలుగుదేశం హయాంలో..

చేనేత కార్మికుల ఆత్మహత్యలు అరికట్టేందుకు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శివారులో 65వ నెంబర్ జాతీయరహదారి పక్కన 50 ఎకరాల విస్తీర్ణంలో రూ.3.31కోట్లతో టెక్స్‌టైల్ పార్క్‌ను నెలకొల్పారు. 2003లో అప్పటి మంత్రి ఎలిమినేటి ఉమా మాధవరెడ్డి ఈ పార్క్ పనులకు శంకుస్థాపన చేశారు. తొమ్మిది నెలల్లో పార్క్ పనులు పూర్తిచేసి 10వేల మందికి పైగా చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాల్సి ఉంది. రెండు దశాబ్దాలు దాటినా పార్క్ పనులు సగం కూడా పూర్తికాలేదు. పార్క్‌లో 67మందికి 110 యూనిట్లు కేటాయించారు. సరైన మౌలిక వసతులు కల్పించకపోవడంతో అనేకమంది యూనిట్ల పనులు నేటికీ ప్రారంభించలేదు. కేవలం 40మంది యూనిట్ నిర్మాణాలు పూర్తిచేశారు. సరైన వసతులు లేకపోవడంతో అవి కూడా మూతపడ్డాయి. ప్రస్తుతం ఏడు యూనిట్లు మాత్రమే నడుస్తున్నాయి.



నిరుపయోగంగా కుట్టుమిషన్లు

శిథిలావస్థకు చేరిన సీఎఫ్‌సీ బిల్డింగ్, పరిశ్రమలు

చేనేత జౌళిశాఖ ఆధీనంలో ఉన్న పార్క్ రెండు దశాబ్దాలు దాటినా అభివృద్ధికి నోచలేదు. కామన్ ఫెసిలిటీ సెంటర్ భవనంలోని శిక్షణా కేంద్రం గదులు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, అనేక యూనిట్లు శిథిలావస్థకు చేరాయి. అందులో కంపచెట్లు పెరిగాయి. సెక్యూరిటీ లేకపోవడంతో పలు యంత్రాలు చోరీకి గురయ్యాయి. ప్రహరీ కూలిపోయింది. పార్క్‌కు సంబంధించి, అర ఎకరం భూమి అన్యాక్రాంతమైంది. సరైన విద్యుత్ సౌకర్యంలేదు. చేనేత జౌళిశాఖ అధికారులు నిర్వహణ బాధ్యతల నుంచి చేతులెత్తేయడంతో పార్క్ అస్తవ్యస్తంగా మారింది. పార్క్‌ను పట్టించుకునే వారు కరువయ్యారు. 10మంది మాత్రమే యూనిట్ యజమానులు ఉండటంతో పార్క్ నిర్వహించలేకపోయారు.

ఫలించిన పోరాటం

చేనేత జౌళిశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో పార్క్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పార్క్ నిర్వహణ బాధ్యతలు టీజీఐఐసీకి అప్పగించాలని కొన్నేళ్లుగా ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నరు. ఈ మేరకు యూనిట్ యజమానులు లోకల్ ఏరియా అథారిటీ ఆఫ్ సొసైటీ (ఐలా) ఏర్పాటు చేసుకున్నారు. ఐలా ద్వారా టీజీఐఐసీకి అప్పగించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచి పోరాటం చేస్తున్నారు. ఎట్టకేలకు మల్కాపురం టెక్స్‌టైల్ పార్క్ యజమానుల కోరిక మేరకు స్పందించి టీజీఐఐసీకి అప్పగించింది. ఇక నుంచి టెక్స్‌టైల్‌కు మహర్దశ పట్టనుందని యజమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

టీజీఐఐసీకి అప్పగించడం అభినందనీయం



దండుమల్కాపురం టెక్స్‌టైల్ పార్క్ నిర్వహణ, అభివృద్ధి బాధ్యతలు టీజీఐఐసీకి అప్పగించడం అభినందనీయం. మా ఆశయం ఫలించింది. టీజీఐఐసీ ఐలా ఆధ్వర్యంలో పార్క్‌ను అభివృద్ధి చేస్తాం. వివిధ కారణాలతో 38మంది యూనిట్ యజమానులు కోర్టులో కేసువేశారు. కోర్టు కేసులు వెకేట్ చేయించి పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలి. చేనేత జౌళిశాఖ వద్ద ఉన్న రూ.86లక్షల నిధులను ఐలాకు బదిలీ చేయాలి. సీఎఫ్‌సీ భవనానికి మరమ్మతులు చేయాలి.

ఎంకే.ప్రసాద్, ఐలా అధ్యక్షుడు

రసాయన ఎరువులతో

ఆహారం విషతుల్యం

● ఫిలిప్పీన్స్, సింగపూర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు



అమేయా కృషి విజ్ఞాన కేంద్రంలో పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

భువనగిరి రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అధిక పంటల ఉత్పత్తి కోసం రసాయన ఎరువులను వినియోగిస్తే ఆహారం విషతుల్యం అవుతుందని ఫిలిప్పీన్స్, సింగపూర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆండ్రీలిమ్, జోసెఫిన్ గుంబ, లూ అన్నారు. మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం రామకిష్టాపురంలో అమేయా కృషి వికాస కేంద్రాన్ని వారు పరిశీలించి మాట్లాడారు. సేంద్రియ ఎరువులతో సాగు చేస్తున్న జిట్టా బాల్‌రెడ్డి, జిట్టా జ్యోతిరెడ్డిలను వారు అభినందించారు. మానవ మనుగడకు ప్రమాదకరంగా మారిన క్యాన్సర్ నివారణకు ఫిలిప్పీన్స్‌లో వినియోగిస్తున్న 3 సీ (క్యారెట్, కుకుంబర్, సేలరీ) ద్రావణం తయారీని వివరించారు. వారివెంట మెదక్ జిల్లాకు చెందిన ఎన్జీవోలు జాన్సన్, రాజు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్‌కు చెందిన అభ్యుదయ రైతులు పిట్టల శ్రీశైలం, ధర్మారెడ్డి, ఐస్‌క్రీమ్ మిల్లెట్ ఆవిష్కర్తలు నరేశ్, లక్ష్మణ్, కురియన్, మన్మోహన్ రెడ్డి, చంద్రశేఖర్, రామకిష్టాపురం విత్తనోత్పత్తి ఎఫ్‌పీవో సిద్ధారెడ్డి, సీఈవో శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ కత్వ

డీపీఆర్ సిద్ధం చేయాలి

● మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్, మర్రిగూడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ ప్రాంతంలోని సాగునీటి అవసరాలకోసం చిన మూసీలోని మైసమ్మ కత్వ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనుల కోసం సర్వేచేసి డీపీఆర్‌ను సిద్ధంచేయాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో మంగళవారం ఇరిగేషన్ అధికారులతోపాటు రిటైర్డు ఇంజనీర్లఫోరం సభ్యులతో నియోజకవర్గంలోని వివిధ ప్రాజెక్టులపై ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో మూసీ నదిలోకి వృథాగా వెళుతున్న జలాలను లిఫ్ట్ ద్వారా చౌటుప్పల్ మండలంలోని పలు గ్రామాల చెరువులు, కుంటలను నింపి రైతులకు సాగు నీటి సమస్యను తీర్చేందుకు అవకాశం ఉంటుందని ఎమ్మెల్యేకు రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం సభ్యులు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, సత్తిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి వివరించారు. మూసీనదిలో మైసమ్మ కత్వ వద్ద లిఫ్ట్‌ను ఏర్పాటుచేసి జలాలను దండు మల్కాపురం, కైతాపురం, లక్కారం, తంగడపల్లి, చౌటుప్పల్, డి.నాగారం, పంతంగి తదితర గ్రామాల్లోని చెరువులు, కుంటలను నింపితే భూగర్భజలాలు గణనీయంగా పెరిగి వ్యవసాయరంగం సస్యశ్యామలమవుతుందన్నారు. లిఫ్ట్ ద్వారా వచ్చే జలాలతో చౌటుప్పల్ మండలంతోపాటు సంస్థాన్‌నారాయణపురం, మునుగోడు, చిట్యాల మండలాలలోని గొలుసుకట్టు చెరువులు, కుంటలు నిండి సాగునీటి అవసరాలను తీర్చుతాయని వారు ఎమ్మెల్యేకు వివరించారు. ఇందుకు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులకు సంబంధించి సర్వేచేసి డీపీఆర్‌ను రూపొందించాలన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

మర్రిగూడ మండలంలోని శివన్నగూడెం రిజర్వాయర్‌నుంచి చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం మండలాల్లోని తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.1200కోట్లతో సిద్ధంచేసిన ప్రణాళికలపై ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ ప్రణాళికలో చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని గ్రీన్ ఇండస్ట్రీయల్ పార్క్‌కు ఈ రిజర్వాయర్ నుంచి తాగునీరు అందించేందుకు రూపకల్పన చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. శివన్నగూడెం రిజర్వాయర్ పనులు 80శాతం పూర్తయ్యాయని, రిజర్వాయర్ కింద డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ పనులు మొదలు కాలేదన్నారు. ఈ పనులపై సర్వేచేసి డీపీఆర్‌ను సిద్ధంచేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. నీటి పారుదల శాఖ మంత్రితో పాటు సంబంధిత అధికారులతో చర్చించి మహబూబ్‌నగర్‌లోని ఎదుళ్ల రిజర్వాయర్ నుంచి శివన్నగూడెం రిజర్వాయర్‌కు నీటిని తరలించే విధంగా రూ.1800కోట్లతో పరిపాలన అనుమతులను తీసుకొచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సాగు, తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. సమీక్షలో ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ రాములు, డీఈ కాశీం తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్యకల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖ మండపంలో సుదర్శన నారసింహహోమం, నిత్య తిరుకల్యాణపర్వాలను పాంచారాత్రగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి, ముఖ మండపంలోని స్పటికమూర్తులకు నిత్యపూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.23,36,360 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు.



ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

22 నుంచి దేవీశరన్న నవరాత్రోత్సవాలు

ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2వరకు దేవీ శరన్నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. తొమ్మిది రోజులపాటు శివాలయంలో జరిగే నవరాత్రోత్సవాల్లో రూ. 1,116(దంపతులు మాత్రమే), ఒక రోజు సప్తశతి పారాయణాలు, లక్ష కుంకుమార్చనలకు వేర్వేరుగా రూ.116 చెల్లించి పాల్గొనేందుకు అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో నిత్యం జరిగే రుద్ర హోమం రద్దు చేసినట్లు ఈవో తెలిపారు.

మఠంపల్లి: సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి లక్ష్మీనృసింహుని కల్యాణం మంగళవారం కన్నుల పండువగా సాగింది. భక్తవత్సలునికి నిజాభిషేకం, నిత్యార్చనలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలకు శ్రీకారం

మట్టపల్లివాసుడి ఆలయంలో ఈనెల 19 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న పవిత్రోత్సవాలకు గురువారం రాత్రి యాజ్ఞికులు శ్రీకారం చుట్టనున్నారు. వేడుకల వివరాలను మంగళవారం ఆలయ ధర్మకర్తలు, ఈవో వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.



యాత్ర పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డిపో మేనేజర్ లక్ష్మీనారాయణ

జ్యోతిర్లింగాలు, షిర్డీయాత్రకు స్పెషల్ బస్‌సర్వీసులు

సూర్యాపేట అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని నాలుగు జ్యోతిర్లింగాలు, షిర్డీయాత్రకు సూర్యాపేట ఆర్టీసీ డిపో నుంచి స్పెషల్ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ జీ లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం సూర్యాపేట జిల్లాకేంద్రంలోని డిపోలో యాత్ర కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. బాసర సరస్వతీ దేవాలయం, నాందేడ్‌లోని సిక్కు స్వర్ణదేవాలయం, పర్లి వైద్యనాథ్ జ్యోతిర్లింగం, ఎల్లోరా గుహలు, విఘ్నేశ్వర జ్యోతిర్లింగం, శనిసింగనపూర్, శనీశ్వర దేవాలయం, షిర్డీ సాయిబాబా దేవాలయం, నాసిక్ పంచవటి, కాలరామ మందిరం, త్రయంబకేశ్వర జ్యోతిర్లింగం, భీమశంకేశ్వర జ్యోతిర్లింగం, పుండరీపురం పాండురంగ విఠలాస్వామి దేవాలయం, తుల్జాపూర్ తుల్జాభవానీ శక్తిపీఠం దర్శించుకోవచ్చన్నారు. ఈ నెల 23న రాత్రి 7గంటలకు సూర్యాపేట కొత్తబస్టాండ్ నుంచి బస్సు బయలుదేరుతుందని, ఈ నెల 28న సూర్యాపేటకు తిరిగి చేరుకుంటుందన్నారు. పెద్దలకు రూ.6వేలు, చిన్నపిల్లలకు రూ.4వేల చార్జీ ఉంటుందన్నారు. వివరాలకు సెల్:9948303712 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ డీ.సైదులు, రమశ్రీ, ధనమ్మ, రవికుమార్, ఏకాంబరం, అబ్దుల్‌గని, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు అవకాశం

చిట్యాల రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా టెన్త్, ఇంటర్ చదివేందుకు అడ్మిషన్లు ఈ నెల 18వ తేదీ వరకు అవకాశం ఉందని నల్లగొండ జిల్లా చిట్యాల మండల ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ పానుగోతు సైదానాయక్, సహాయ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ కారణాలతో చదువును మధ్యలో ఆపేసిన వారు ఓపెన్ సొసైటీ ద్వారా పూర్తి చేయవచ్చన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి చిన్నకాపర్తి ఉన్నత పాఠశాలలో తరగతులను నిర్వహిస్తారని, అడ్మిషన్లు ప్రారంభమైనట్లు తెలిపారు. 14 సంవత్సరాలు నిండిన వారు టెన్త్‌లో చేరేందుకు అర్హులన్నారు. ఓపెన్ ఇంటర్‌లో చేరేవారు 15 సంవత్సరాలు నిండి 10వ తరగతి పాస్ మెమో, ఆధార్, కులధ్రువీకరణ జీరాక్స్ రెండు జతలతో పాటు ఒక ఫొటోను అందజేయాలని తెలిపారు. విద్యార్హత కోసం ఓపెన్ టెన్త్, ఇంటర్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒకే ఏడాదిలో ఇంటర్‌ను పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. ఇతర వివరాల కోసం 9441331489, 9441291637 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే

చౌటుప్పల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలకేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. దొడి కొమురయ్య, ధర్మబిక్షం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాం రాజును తెలంగాణ ప్రాంతం నుంచి తరిమికొట్టి ప్రజలకు స్వేచ్ఛా, స్వాతంత్య్రాలను అందించిన చరిత్రను, బీజేపీ వక్రీకరించి హిందూ, ముస్లింల మధ్య జరిగిన యుద్ధంలా వక్రీకరిస్తోందన్నారు. సమాజంలో గొడవలు సృష్టించడానికి ప్రయత్నిస్తోందన్నారు.



నారాయణపురంలో ధర్మభిక్షం విగ్రహం ఎదుట నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సత్యం, సీపీఐ నాయకులు

సాయుధ పోరాటంలో సామాన్యులే సమరాన్ని నడిపిన ఘనత ఈ పోరాటానికి ఉందన్నారు. రాజకొండ ప్రాంత గెరిల్లా దళాలకు అండగా నిలబడిన గుత్తా సీతారాంరెడ్డి, రాజబహదూరగౌర్, బొమ్మగాని ధర్మభిక్షం, కృష్ణమూర్తి లాంటి వాళ్లు ఎందరో పోరాడారన్నారు. ఈ గడ్డలో సాయుధ పోరాట అమర వీరుల స్మృతిని ఏర్పాటుచేసి నేటి యువత, విద్యార్థులకు చరిత్రను తెలిసేలా పాఠ్యాంశంలో చేర్చాలని డిమాండ్ చేవారు. ప్రభుత్వమే అధికారికంగా తెలంగాణ విలీన దినంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యులు బచ్చనబోయిన గాలయ్య, కే శ్రీనివాస్, మండల కార్యదర్శి దుబ్బాక బాస్కర్, కలకొండ సంజీవ, చిలువేరు ఆంజయ్య, దేశిడి నరేందర్ రెడ్డి, వీరమల్ల యాదయ్య, సుర్వి నర్సింహ, పల్లె మల్లారెడ్డి, మంచాల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

నకిరేకల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ జాతీయ కిసాన్‌మోర్చ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్‌పటేల్ చొరవతోనే స్వాతంత్య్రం వచ్చిందని బ్రిటీషర్లు నల్లగొండ జిల్లాకు చెందిన 350 మందిని ఊచకోత కోశారన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహణపై మొదటి సంతకం చేస్తుందన్నారు. సమావేశంలో బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నకిరేకంటి మొగిలయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి మండల వెంకన్న, నాయకులు పబ్బు వెంకన్న, గుడుగుంట్ల సాయన్న, చినేని జాని, గర్రె మురళిమోహన్, బుడిగె సైదులు, బండ మధూకర్‌రెడ్డి, సైదులు, జొనగిరి వెంకటేశ్వర్లు, రాచకొండ గోపి, చందుపట్ల వేణుమాధవ్, కారింగుల యాదగిరి పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న గోలి మధుసూదన్‌రెడ్డి

ఉమ్మడి నల్లగొండ జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపిక


తుర్కపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన తలారి హెన్నా ఉమ్మడి నల్లగొండ జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికైంది. వలిగొండ మండలం పులిగిల్ల గ్రామంలో ఈ నెల 15న నిర్వహించిన అండర్-14 బాలికల విభాగంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైంది. క్రీడాకారిణి హెన్నాతో పాటు ఫిజికల్ డైరెక్టర్ మల్లం చంద్రమౌళిని ప్రధానోపాధ్యాయుడు రాపెల్లి శ్రీనివాస్, తదితరులు అభినందించారు.



తలారి హెన్నా

ప్రైవేట్ ఆసుపత్రులపై బకాయిల భారం

● నిలిచిన ఆరోగ్యశ్రీ సేవలు



(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

రూ.కోట్లలో బకాయిలు ఉన్నా ప్రభుత్వం నిధులు విడుదల చేయపోవడాన్ని నిరసిస్తూ ఆరోగ్యశ్రీ సేవలను ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు నిలిపివేయనున్నాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి నిలిపివేత నిర్ణయాన్ని అమలు చేయనున్నాయి. ఆర్థికపరమైన అడ్డంకులు తొలగించడం ద్వారా పేదలకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన, అత్యవసరంగా వైద్యం పొం దేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం బకాయిల నిధులు విడుదల చేయాలని ఆసుపత్రుల యజమాన్యాలు కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నాయి. గత ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు ఏడాదిగా చెల్లించకపోవడం, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత బకాయిల్లో కేవలం 10 శాతం మాత్రమే విడుదల చేయడంతో రెండేళ్లుగా బకాయిలు పేరుకుపోయాయి. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ కలిగిన ఒక్కో ఆసుపత్రికి ప్రభుత్వం రూ.కోట్లలో బకాయిలు చెల్లించాల్సి ఉండగా కనీసం 30 శాతం నిధులైనా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు సంబంధిత యూనియన్ వర్గాలు తెలిపాయి. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇక బకాయిలభారం మోయలేమని, నిధులు విడుదల చేసేవరకూ ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేస్తున్నారు.

సేవలు పెంచినా పెరగని చార్జీలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2007లో ప్రభుత్వం తెల్లరేషన్‌కార్డు కలిగిన పేదలకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో దీర్ఘకాలిక, ఖరీదైన వైద్యం పొందేందుకు ఆరోగ్యశ్రీ పథకం కింద వెసులుబాటును కల్పించింది. పేదరోగుల వైద్యచికిత్సకు అయిన ఖర్చును ఈ పథకం కింద ప్రభుత్వమే భరించి ఆసుపత్రులకు నిధులు విడుదల చేస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 1,672 వ్యాధులకు చికిత్సచేయగా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో అదనంగా 163 వ్యాధులకు మొత్తంగా 1,835 రకాలకు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ కలిగిన ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సను పొందేలా అవకాశం పెంపొందించారు. డయాలసిస్ మొదలుకొని గుండెజబ్బుల వరకు ఆర్యోగ్యశ్రీ సేవలను విస్తరించారు. గతంలో రేషన్‌కార్డు కలిగిన కుటుంబ సభ్యులందరికీ రూ.5 లక్షల్లోపు వైద్యం పొందే అవకాశం ఉండగా, ఆ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచారు. కాగా ఉద్యోగుల, జర్నలిస్టుల ఆరోగ్య పథకం కింద రెండేళ్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. వైద్యం చేస్తే వచ్చే డబ్బుల కన్నా రోగి చికిత్సకు ఔషధాలు, శస్త్రచికిత్స ఖర్చులకు డబ్బులు లేక కొన్ని ఆసుపత్రులు ఇప్పటికే అనధికారికంగా ఈహెచ్ఎస్, జేహెచ్ఎస్ కింద సేవలను నిలిపివేశాయి. మరోవైపు వీటి ఫీజును పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలని కోరినా ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని ఆసుపత్రుల యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి.

రూ.115 కోట్లకు పై బకాయిలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 56 ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా లక్షలాది మంది పేదలు ఉచిత వైద్యసేవలు పొందుతున్నారు. ఆరోగ్యశ్రీతో పాటు ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్), జర్నలిస్టుల ఆరోగ్య పథకం(జేహెచ్ఎస్) కింద వైద్య సేవలు పొందుతున్నారు. కాగా ఆరోగ్యశ్రీ, ఉద్యోగుల, జర్నలిస్టులకు వైద్య సేవలకు ప్రభుత్వం కొంతకాలంగా నిధులు విడుదల చేయకపోవడంతో ఆసుపత్రుల నిర్వహణ కష్టంగా మారిందంటున్నారు. ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యశ్రీ బకాయిలు సుమారు రూ.115 కోట్లకుపైగా ఉన్నట్లు వైద్య రంగ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు. గత ఆగస్టులో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తామని యాజమాన్యాలు హెచ్చరించిన నేపథ్యంలో ప్రభుత్వం ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చించి మూడు నెలలకు సంబంధించి నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చి 10 శాతం నిధులు మాత్రమే విడుదల చేసినట్లు ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. చర్చల సందర్భంలో ప్రభుత్వం క్రమం తప్పకుండా బకాయిలు చెల్లింపు, ధరల పునరుద్ధరణ చేస్తామని మాట ఇచ్చి పాటించడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించే వరకూ ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయనున్నట్లు ప్రకటించారు.

ధరలు పునఃసమీక్షించాలి



పెరిగిన ధరలకు అనుగుణంగా ఈఎస్‌హెచ్, జేఎస్‌హెచ్ ఫీజులను పునఃసమీక్షించాలి. తక్షణమే 30 శాతం పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి. బకాయిల భారంతో ఆసుపత్రి నిర్వహణ కష్టంగా మారింది. ప్రభుత్వం బకాయిలు విడుదలచేసి పేదలకు ఆరోగ్యశ్రీ సేవలు అందేలా చర్యలు చేపట్టాలి.

డా.ముప్పా రామారావు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు

స్థానిక ఎన్నికలను బీసీ రిజర్వేషన్‌తో ముడిపెట్టడం సరికాదు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లతో ముడిపెట్టి స్థానిక సంస్థలకు ఎన్నికలను నిర్వహించకపోవడం సరికాదని కాంగ్రెస్ నాయకుడు ఉండ్ర లింగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో పాలన కుంటుపడి పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారవుతోందని పేర్కొన్నారు. బీసీలకు 42శాతం, మిగతా 28శాతం ఎస్సీ, ఎస్టీలకు పోను మిగితా 30శాతం రిజర్వేషన్లను జనరల్‌గా కాకుండా ఓసీలుగా పరిగణించాలన్నారు.

తాపీమేస్త్రీల మండల కమిటీ ఎన్నిక

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అనుబంధ తాపీ మేస్త్రీ మండల కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా చింతపల్లి బయ్యన్న, అధ్యక్షుడిగా మంద ఎల్లయ్య, ఉపాధ్యక్షుడిగా కుక్కల వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా బొల్లెద్దు సైదులు, సహాయ కార్యదర్శులుగా మేడి యాదయ్య, ముప్పిడి లింగాలు, మంద వెంకటేశ్, కోశాధికారిగా దొడ్డి రాజు ఎన్నికయ్యారు. సమావేశంలో వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షుడు చెర్కు పెద్దులు, దండు రవి తదతరులు పాల్గొన్నారు.

వంద పడకల ఆసుపత్రి పనుల పరిశీలన



పనుల పురోగతిపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నకిరేకల్‌లో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను మంగళవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పరిశీలించారు. వచ్చే నెల వరకు ఆసుపత్రి నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. ఆరు గ్యారెంటీల మెనిఫెస్టో సభ్యుడు చామల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పన్నాల రాఘవరెడ్డి, చెవుగోని శ్రీనివాస్, మాద యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూరు: కట్టంగూరు మాజీ సర్పంచ్ దివంగత ఎరకల జానయ్య సతీమణి ఎరకల దుర్గమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మంగళవారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, రెడ్డిపల్లి సాగర్, ఎరకల రవికుమార్, ఎరకల శ్రీను, మిట్టపల్లి శివశంకర్, బూరుగు శ్రీను, బిక్షం, పిన్నపురెడ్డి మధుసూదన్‌రెడ్డి, ముక్కమాల శేఖర్, రెడ్డిపల్లి వీరస్వామి, కొలిపాక సురేందర్ ఉన్నారు.

భయపెడుతున్న భవనం

● బీటలు వారుతున్న ఏవో కార్యాలయం గోడలు ● పగుళ్లలోకి చేరుతున్న సర్పాలు ● సిబ్బంది, రైతుల భయం

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం భవనానికి పలుచోట్ల బీటలు వారాయి. భవనానికి ఎప్పుడు ఏ రూపంలో ప్రమాదం పొంచి ఉందోనని ఉద్యోగులు.. కార్యాలయానికి వచ్చే రైతులు భయపడుతున్నారు. కనీస మరమ్మతులు చేయించడానికి కూడా నిధులు లేకపోవడం ప్రత్యామ్నాయం కూడా లేక చేసేదేమీలేక ఎలాగోలాగా నెట్టుకొస్తున్నారు. కార్యాలయం పక్కనే రైతువేదికను నిర్మించినా అందులో సమావేశాలకే పరిమితమవుతోంది. సుమారు 20ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ భవనాన్ని ప్రారంభించారు. అప్పటి హౌసింగ్ శాఖ నమూనా మేరకు ఈ భవన నిర్మాణం జరిగింది. భవనంలో కింద హాలు మాత్రమే ఉంది గదులు లేవు. హాలులోనే టేబుళ్లు కుర్చీలు వేసుకుని ఏవోతో పాటు ఏఈవోలు కూర్చుని విధులు





బీటలు వారిన మండల వ్యవసాయ అధికారి కార్యాలయం

నిర్వహిస్తున్నారు. భవనంపైన ఉన్న గదిలో మట్టి నమూనా సేకరణ పరీక్షలు తదితర సామాగ్రిని నిల్వ ఉంచారు. కాగా భవన నిర్మాణంలో నాణ్యత లోపించడంతో భవనానికి పలు చోట్ల బీటలు వారి ప్రమాదం పొంచి ఉంది. భవనం బేస్‌మెంట్, మొదటి అంతస్తు మెట్ల మార్గం, కార్యాలయ ప్రవేశ ద్వారం మెట్లకు ఆనుకుని కట్టిన గోడలకు భారీ పగుళ్ల ఏర్పడుతున్నాయి. బీటలు వారి పెద్దవిగా ఉన్న పగుళ్ల మధ్యలో సర్పాలు చేరి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

ఈ బడులు.. నీటి మడులు



సరంపేట పాఠశాల ఆవణలో నిలిచిఉన్న వర్షపు నీరు(ఫైల్)

వర్షం వస్తే వరద నీరంత పాఠశాలల ఆవరణాల్లోకి చేరుతోంది. మండలంలోని వట్టిపల్లి, దామెరబీమనపల్లి, సరంపేట, ఇందుర్తి మెటీచందాపురం, శివన్నగూడ, తానేదార్‌పల్లి, రాంరెడ్డిపల్లి, కొండూరు గ్రామాల్లోని పాఠశాలల్లో వర్షం వస్తే పాఠశాలల ఆవరణలోకి వస్తుంది. నీరు భూమిలో ఇంకినా బురద ఉంటుందని బురద పేరుకుంటోంది. విద్యార్థులు ఆ బురదలో నుంచే వెళ్తుండడంతో కాలు జారి పడిపోతామోనని భయపడుతున్నారు. వర్షం నీరు నిలిచి ఉండకుండా మట్టి లేదా మొరం పోయించకుండా అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. అధికారులు స్పందించి పాఠశాలల ఆవరణాల్లో నిలిచి ఉన్న నీటిని తొలగించాలని కోరుతున్నారు.

● ఆంధ్రజ్యోతి, మర్రిగూడ.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

మర్రిగూడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే కస్తూరి ఫౌండేషన్ లక్ష్యమని ఫౌండేషన్ ఛైర్మన్ చరణ్ అన్నారు. మంగళవారం మండలంలోని దామర భీమనపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ సౌజన్యంతో టై, బెల్ట్, ఐడి కార్డు, బ్యాడ్జీలను పంపిణీ చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడి తమ లక్ష్యంపై దృష్టి సారించాలని సూచించారు. విద్యపై శ్రద్ధ కలిగి చదివితే భవిష్యత్తులో మంచి ప్రయోజకులు అవుతారని తల్లిదండ్రులకు సమాజంలో మంచి గుర్తింపు తెచ్చిన వారవుతారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గుణవతి, లచ్చిరాం నాయక్, జిల్లా శంకర్, రమేష్, శ్రీనివాస్ నాయక్, వెంకటేష్, మీనా, మంజు లింగయ్య ఉన్నారు.

ఆయుష్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

చండూరు, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ఆయుష్ ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని యునాని ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌజన్య కోరారు. రోగులకు ఆరోగ్య పరీక్షలు చేసి, మందులు ఉచితంగా అందజేశారు. వృద్ధాప్యంలో వచ్చిన అనారోగ్య సమస్యలకు ఆయుష్ వైద్య విధానం ద్వారా సులువైన చికిత్స అందించనున్నట్లు తెలిపారు. రక్తపోటు, మధుమేహం, మోకాళ్ల నొప్పులు, కిడ్నీలలో రాళ్ల, ఇతర జబ్బులతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు అందిస్తున్నట్లు తెలిపారు. .

క్రీడల్లో ప్రతిభ చూపాలి

కేతేపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ పోటీల్లో ప్రతిభ చూపితే విద్యార్థులు మున్ముందు మరిన్ని పోటీల్లో రాణించవచ్చునని నకిరేకల్ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ గుత్తా మంజులమాధవరెడ్డి అన్నారు. మండల కేంద్రం కేతేపల్లిలోని డీపాల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలను ప్రారంభించారు. విద్యార్థులు నైపుణ్యం ప్రదర్శించి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికకావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఎంఈవో ఎ. రాజేంద్రప్రసాద్, హెచ్ఎంలు వి.రఘు, సీహెచ్.అశోకరెడ్డి, పుణ్యవతి, ఫాదర్ శాజి, పీడీలు హరిత, నాగయ్య, బంటు రవి, మాధవి, సైదులు, మహేష్, సీఆర్పీలు కె.మహేందర్, ఎ.మల్లయ్య పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

శాలిగౌరారం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ సీఈవో ఎంవీ గోనారెడ్డి అన్నారు. శాలిగౌరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1972లో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు గురజాల గ్రామానికి చెందిన ఎంవీ గోనారెడ్డి, శాలిగౌరారం గ్రామానికి చెందిన చాడ రమేష్ చందర్ రెడ్డి, పల్‌రెడ్డి ఫౌండేషన్ ఛైర్మన్ పల్‌రెడ్డి రాంరెడ్డి పాఠశాలను సందర్శించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు ఉపయోగపడే జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు, స్కూల్ అట్లాస్ బుక్స్, ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్ష పుస్తకాలు అందజేశారు. కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్, పల్‌రెడ్డి ఫౌండేషన్, పూర్వ విద్యార్థుల సంఘం తరపున పాఠశాల అభివృద్ధికి అవసరమైన నిధులను సమీకరిస్తామని గోనారెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కోట మల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోషకాలతో కూడిన ఆహారం అందించాలి

చిట్యాలరూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు పోషకాలతో కూడిన సమతులమైన ఆహారాన్ని పెట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి, మండల ప్రత్యేక అధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. మండలం ఉరుమడ్లలోని జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పథకం ద్వారా అందించే బియ్యం, కూరగాయలను, వండిన వంటలను పరిశీలించారు. పాఠశాలల్లో నాణ్యమైన వంటలు వండాలని కూరగాయలు, ఆకుకూరలు పప్పుదినుసులు నాణ్యతగా ఉండాలని వంటలను రుచికంగా ఉండాలన్నారు. వంటల్లో నాణ్యత సమతులమైన ఆహారంలో రాజీపడరాదని, ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా సహించేదిలేదని హెచ్చరించారు. ప్రధానోపాధ్యాయుడు బి. వెంకట్‌రెడ్డి, ఆర్. వెంకన్న, వ్యవసాయ అధికారి పగిడిమర్రి గిరిబాబు తదితరులు ఉన్నారు.



వంటలు పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి శ్రవణ్‌కుమార్

తెలంగాణ సాయుధ పోరాటం మహోన్నతమైనది



స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కనగల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రపంచ చరిత్రలో తెలంగాణ సాయుధ పోరాటం మహోన్నతమైనదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొలుగురి నర్సింహ అన్నారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పొనుగోడు గ్రామంలో సాయుధ పోరాట యోధుడు జోగు రంగనాయకులు స్థూపానికి మంగళవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా నర్సింహ మాట్లాడుతూ రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టులదన్నారు. సాయుధ పోరాటంలో 4,500 మంది అమరులయ్యారని అన్నారు. సాయుధ పోరాట చరిత్రను భావి తరాలకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గంట సత్యనారాయణ, సహాయ కార్యదర్శి దోటి పాండరి నాయకులు ఎండీ జానిమియా, కేవీఎస్ రెడ్డి, రంగనాయకులు కుటుంబ సభ్యులు జోగు ప్రభాకర్, సురేందర్, బొమ్మకంటి రాములు, అండాలు, వెలుగు వెంకన్న, మల్లెపల్లి భిక్షం పాల్గొన్నారు

బాల్యసంరక్షణ, విద్యపై దృష్టి సారించాలి



మునుగోడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన ఆదేశాల ప్రకారం బాల్యసంరక్షణ, విద్యతో పాటు పోషణ్‌లపై అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేకంగా దృష్టి సారించాలని చండూరు ఆర్డీవో శ్రీదేవి, సీడీపీవో లావణ్యకుమారి అన్నారు. మునుగోడులో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బాల్యసంరక్షణ, విద్య బోధనతో పాటు పోషణపై అంగన్‌వాడీ వ్యవస్థ అనే అంశాలపై అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ నేలపట్ల నరేష్, ఏసీడీపీవో వెంకటమ్మ, అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షకులు ఎం. శివేష, ఎం. నాగమణి, ఎస్. సునీత, జె. జయమ్మ ఉన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

శాలిగౌరారం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవలని శాలిగౌరారం లయన్స్ క్లబ్ అధ్యక్షులు గుజలాల్ శేఖర్‌బాబు అన్నారు. మండలం వల్లాల గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సూర్యాపేట లయన్స్ కంటి ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. 70మంది రోగులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్య క్రమంలో కంటి ఆస్పత్రి విజన్ టెక్నీషియన్ బంగారు స్వాతి, లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్ బుడిగె శ్రీనివాసులు, జిల్లా ప్రతినిధి ఎర్ర శంభులింగారెడ్డి, డీసీ డెంకల సత్యనారాయణ, దేవరశెట్టి శ్రీనివాస్, క్లబ్ కార్యదర్శి దామెర్ల శ్రీనివాస్, కోశాధికారి గుండు పరమేష్, క్లబ్ మెంబర్ రామలింగయ్య శర్మ, పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య పాల్గొన్నారు.

ఎరువులు అధికంగా వినియోగించొద్దు



మర్రిగూడలో పత్తి మొక్కలను పరిశీలిస్తున్న ఏడీఏ వేణుగోపాలచారి

మర్రిగూడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పత్తిలో అధిక ఎరువులు వేయకుండా ఉండి యాజమాన్య పద్ధతులు సక్రమంగా పాటిస్తే ఎర్ర గుమ్మడి తెగులు, ఆకుముడుత సోకదని ఏడీఏ వేణుగోపాలచారి అన్నారు. మంగళవారం మండలంలోని రామ్‌రెడ్డిపల్లి గ్రామంలో ఎర్ర గుమ్మడి తెగులు సోకిన పత్తి పంటను ఆయన పరిశీలించారు. రైతులు యజమాన్య పద్ధతులు సక్రమంగా పాటిస్తే ఎర్ర గుమ్మడి తెగులు నివారించవచ్చునన్నారు. మర్రిగూడ ఏవో సహాస్, ఏఈవోలు, రైతులు ఉన్నారు.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

మునుగోడు రూరల్ : రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని ఏవో పద్మజ సూచించారు. మండలంలోని పలివెల గ్రామంలో పత్తి, వరి పంటలు మంగళవారం ఆమె పరిశీలించారు. పత్తిలో తామర పురుగు, ఎర్ర నల్లి, పచ్చదోమ, రసం పీల్చే పురుగులు, కాయ కుళ్లు తెగులును గమనించి వాటి నివారణ కొరకు ఇథియాన్ 40శాతం + సైపర్మెత్రిన్ 5శాతం మందు 2.5మి.లీలు లీటరు నీటికి చొప్పున కలిపి, వేప నూనె 1500 పీపీఎం, 5.మి.లీలు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. వేప నూనెతో పురుగుల జీవిత చక్రం గుడ్డు దశలోనే అరికట్టవచ్చని తెలిపారు. వరిలో ఆకు ముడతను గమనించి రైతులు తీసుకోవాల్సిన తగు నివారణ చర్యల గురించి వారికి వివరించారు. పురుగు మందులను ఎప్పుడూ కూడా మోతాదుకు మించి వాడకూడదు. ఇతర బయోలతో కలిపి వాడకూడదు. వాడితే పంటలపై ప్రభావం పడుతుంది. వాటితో పాటు ఏఈవో కె.నిఖిల్ కుమార్, రైతులు గోసుకొండ మల్లేష్, లింగయ్య, నరసింహ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

చండూరు, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో, హాస్టల్‌లలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో భవనాలు శిథిలావస్థలో చేరి కూలిపోయే ప్రమాదాలు ఉన్నాయని, వాటి స్థానంలో నూతనంగా భవనాలను నిర్మించాలన్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు సరిపడా లేక నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు పల్లె రాజు, చరణ్, మహేష్, కిరణ్, మనీషా, సరిత, కల్పన పాల్గొన్నారు.

మల్లయాచారికి విశ్వకర్మ విద్యావిభూషణ్ అవార్డు



మల్లయాచారిని సన్మానిస్తున్న సన్మానిస్తున్న ప్రతినిధులు

చండూరు, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన బొడ్డోజు మల్లయాచారి ప్రతిష్ఠాత్మకమైన విశ్వకర్మ విద్యావిభూషణ్ జాతీయ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని బేగంపేట్ పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన శ్రీవిరాట్ విశ్వకర్మ యజ్ఞమహోత్సవం- 2025లో భాగంగా తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ జాతీయ అవార్డును ప్రదానం చేసింది. కార్యక్రమంలో నిర్వాహకులు పోలోజు రాజ్‌కుమార్, శాంత కృష్ణ ఆచార్య, అప్పినపల్లి భాస్కరాచారి పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో ఉట్టికొట్టే ఉత్సవం



జ్ఞాపిక అందజేస్తున్న దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమిని పురస్కరించుకుని స్థానిక వారిజాల వేణుగోపాల స్వామి ఆలయంలో మంళవారం రాత్రి ఉట్టి కొట్టే వేడుక ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.ఉట్టిని కొట్టేందుకు యాదవ సోదరులు ఉత్సాహం చూపి పోటీ పడ్డారు. ఉత్సవంలో మేడబోయిన అబి ఉట్టి కొట్టారు. అనంతరం ఉట్టిలో పూజలందుకున్న ప్రసాదాన్ని స్వీకరించేందుకు భక్తులు పోటీపడ్డారు. అనంతరం ఉట్టి కొట్టిన మేడబోయిన అబితో పాటు ఈ వేడుకలోపాల్గొన్న యాదవ సోదరులను ఆలయ అర్చకులు కారంపూడి కృష్ణమాచార్యులు, వేణాచార్యులు ఆశీర్వదించారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సన్మానించి భగవద్గీత గ్రంథాన్ని బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన ఛైర్మన్ దోసపాటి ప్రసాద్, సామ కొండల్‌రెడ్డి, ఐతరాజు రమేశ్, పెద్దగొల్ల జెనిగె కనకయ్య, బిక్షం, సారెగొల్ల దుబ్బాక శ్రీధర్, దూదిమెట్ల సత్తయ్య, స్రవంతి, జెరిపోతుల భరత్, ఇడుకుళ్ల భిక్షమయ్య, దోసపాటి విష్ణుమూర్తి, రఘు, జాల సైదులు మంజుల, డీజే రాజు, కంబాలపల్లి మల్లయ్య, బండారు రమేశ్, దోసపాటి వేణు, అమరవాది రాములు, దాచేపల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


హాస్టల్‌లో రాత్రి బస



హాస్టల్‌లో నిద్రిస్తున్న అధికారులు, విద్యార్థినులు

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాలు అభివృద్ధి శాఖ అధికారుల ఆదేశాల ప్రకారం జిల్లా సంక్షేమ హాస్టల్‌లో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు మంగళవారం రాత్రి బస చేశారు. కేంద్రంలోని షెడ్యూల్ బాలికల బీసీ హాస్టల్‌లో హాస్టల్ ఇన్‌చార్జి దూసరి భారతమ్మ విద్యార్థులతో కలిసి నిద్ర చేశారు. జిల్లా డిప్యూటీ డైరెక్టర్ శశికళతో పాటు, జిల్లా వ్యాప్తంగా అన్ని హాస్టళ్లలో విద్యార్థులతో కలిసి రాత్రి నిద్ర చేశారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు : ఆర్డీవో



మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఆర్డీవో అశోక్‌రెడ్డి

చిట్యాలరూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని నల్లగొండ ఆర్‌డీఓ యారాల అశోక్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని సుంకెనపల్లిలో సర్వేనంబరు 20, 61లో గల ప్రభుత్వ భూమిని గుర్తుతెలియని వ్యక్తులు ఆక్రమించేందుకు చదును చేశారు. విషయం ఆర్డీవో దృష్టికి వెళ్లగా మంగళవారం ఆర్‌డీఓ సదరు భూమిని పరిశీలించారు. పూర్తి వివరాలను చిట్యాల తహసీల్దార్ జి.కృష్ణను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ భూమిలో ఆర్డీవో, తహసీల్దార్ మొక్క నాటి నీళ్లు పోశారు ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రభుత్వ భూములు పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందని 20, 61 సర్వేనంబరు భూమిలో మొక్కలను నాటి చెట్లను పెంచాలన్నారు. ఐదు రోజుల్లో ప్రభుత్వ భూమిల్లో ఉపాధిహామీ సిబ్బంది సహకారంతో మొక్కలను నాటాలని చుట్టూ ఫెన్సింగ్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, కార్యదర్శి మౌనిక, టీఎలు వినోద్, బ్రహ్మచారి సిబ్బంది పాల్గొన్నారు.

ఆమె ఆరోగ్యం కోసం..

(5వ పేజీ తరువాయి)

నమోదుచేసి రోగనిర్ధారణ జరిగితే వారికి అన్ని రకాల సేవలు అందించేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఈ మేరకు క్యాంపుల నిర్వహణకు వైద్యఆరోగ్యశాఖ అధికారులు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. వైద్య శిబారాల్లో నిర్వహించే వైద్య పరీక్షలకు మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూసేందుకు గ్రామకార్యదర్శులు, ఆశావర్కర్ల ద్వారా గ్రామాల్లో ప్రచారం నిర్వహించనున్నారు. ప్రజల భాగస్వామ్యం కోసం రక్తదాన శిబిరాల నిర్వహణ, అవయవదాతల పేర్ల నమోదు చేపట్టనున్నారు.

ఆరోగ్య సేవలు సులభంగా అందేందుకు

వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రభుత్వం అందించే సేవలను సులభంగా పొందేందుకు ప్రత్యేక విధానాల అమలుకు అధికారులు చర్యలు చేపట్టారు. మాతాశిశు సంరక్షణ కార్డు జారీ చేయడం ద్వారా ఇరువురికి ఆరోగ్య సేవలు అందించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ప్రధానమంత్రి 'మాతృ వందనం' కార్యక్రమంలో పేర్ల నమోదు సికిల్ సెల్ కార్డుల నిర్వహణ, పోషణ్ ట్రాకర్‌లో లబ్ధిదారుల పేర్లను నమోదు చేయడం ద్వారా ఆరోగ్య సేవలను అందించే వీలుగా కార్యాచరణ అమలు చేయనున్నారు.

మెగా వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి

మహిళా ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు నిర్వహిస్తున్న మెగా వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో ఉదయం 9గంటల నుంచి పలు రకాల వ్యాధులకు ప్రత్యేక వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహిస్తారు. ఆశా కార్యకర్తలు మహిళలకు, గర్భిణులకు ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించాలి.

● కేస రవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో

ముత్యాలమ్మ పండుగకు హాజరుకావాలని మంత్రికి ఆహ్వానం

కనగల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీఎడవల్లి గ్రామంలో ఈనెల 24, 25వ తేదీల్లో జరిగే ముత్యాలమ్మ తల్లి పండుగకు హాజరు కావాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని జీఎడవల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వాటర్స్‌లో మంత్రిని కలిశారు. కార్యక్రమంలో కర్నాటిగిరి, కొరివిశంకర్, పర్సన బోయిన రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కట్టంగూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు తరాలను నిర్మించే ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది పామనగుండ్ల హైస్కూల్ గెజిటెడ్ హెచ్ఎం మైనం శ్రీలత అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయలుగా ఎంపికైన చింతల సుధీర్ కుమార్, సింగరబోయిన పండరిలను పామనగుండ్లలోని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్వనాథుల రాఘవాచారి, బెల్లి ఆంజనేయులు, తాటిశెట్టి శ్రీనివాసులు, కోరట్ల విజయరాణి, మంగమ్మ తదితరులు ఉన్నారు.

మునుగోడు: మండల ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపీడీవో కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో యుగంధర్‌రెడ్డి, ఎంఈవో తల్లమల్ల మల్లేశం జీహెచ్ఎంలు కె. బాలప్రసాద్, వి. రాధిక, సీహెచ్. వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విమోచనదినం పేరు మార్చడం సరికాదు

కనగల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు17ను ప్రజాపాలన దినంగా మార్చడం సరికాదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పంతంగి సైదులు తదితరులు మంగళవారం వేర్వేరు ప్రకటనలో ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటుందని దుయ్యబట్టారు. సెప్టెంబరు 17ను విమోచన దినంగానే జరపాలని డిమాండ్ చేశారు.


భవిత కేంద్రం పరిశీలన

నకిరేకల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నకిరేకల్‌లోని భవితకేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం రాష్ట్ర అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ రాధారెడ్డి పరిశీలించారు. భవిత కేంద్రంలోని విద్యార్ధిని విద్యార్థులకు, స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పాఠ్యాంశ బోధనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో మేకల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల అందజేత

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లారెడ్డిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లీ లేదా తండ్రీ లేని 20 మంది విద్యార్థులకు యూత్ ఫర్ సేవ సంస్థ స్కూల్ బ్యాగులను అందజేసింది. ఈ కార్యక్రమంలో సంస్థ ఇంచార్జ్ నాగేందర్, హెచ్ఎం హిమజ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
బుధవారం 17 సెప్టెంబరు 2025



గరిష్ఠం 29.0
కనిష్ఠం 23.8

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	588.40 (307.2834)	1,62,968	1,62,968
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.30 (4.02)	4,732.95	6,019.48
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.9152 (44.0839)	87,314	1,37,548

చికెన్ ధరలు	లైవ్ : రూ.140	డ్రెస్ : రూ.220	స్కిన్‌లెస్ : రూ.240

వీరులారా వందనం



నిజాం ప్రభువు ఏలుబడిలో రజాకార్ల నిరంకుశత్వాన్ని ఎదిరించి సాగించిన మహోద్ధృత పోరాటంలో ఉమ్మడి జిల్లాది కీలక పాత్ర. మట్టి మనుషులు ఉద్యమ దివిటీలై.. సామాన్యులే సారథులై నడిపించిన సంగ్రామం.. మహిళలతో సైతం బందూకు పట్టించిన తెలంగాణ సాయుధ పోరాటం.. ఈ పోరులో ఎందరో అసువులుబాశారు. వి మోచనం.. విద్రోహం.. విలీనం.. ఎవరే పేరుతో పిలిచినా తెలంగాణ సమాజానికి స్వేచ్ఛావాయువులను అందించిన ఈ పోరాట ఆనవాళ్లు ఉమ్మడి జిల్లాలో సజీవంగానే ఉన్నాయి. 6



ప్రైవేట్ ఆస్పత్రులపై బకాయిల భారం



పేదల వైద్యానికి ఆసరాగా ఉంటున్న ఆరోగ్యశ్రీ సేవలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచి నిలిచిపోనున్నాయి. ఏళ్లుగా కోట్ల రూపాయల బకాయిలు పెండిగ్‌లో ఉండగా, ప్రభుత్వం బిల్లులు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ ఆరోగ్యశ్రీ సేవలను ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు నిలిపివేయనున్నాయి. బకాయిల్లో కనీసం 30శాతం నిధులైనా విడుదల చేయాలని ప్రైవేట్ ఆస్పత్రులు కోరుతుండగా, సేవలు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటామని ఈ పరిస్థితికి వెంటనే పరిష్కారం చూపాలని పేదలు కోరుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి,మిర్యాలగూడ) 7

టీజీఐఐసీ ఆధీనంలోకి దండుమల్కాపురం టెక్స్‌టైల్ పార్క్



యాదాద్రి భువనగిరి చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని టెక్స్‌టైల్ పార్క్ నిర్వహణ, అభివృద్ధి బాధ్యతలు తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ)కి అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు చేనేత జౌళిశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఆదేశాలు జారీచేశారు. చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో ఉన్న టెక్స్‌టైల్ పార్క్ నిర్వహణ ఇక నుంచి టీజీఐఐసీ తీసుకుంటుంది.

- (ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్ రూరల్)



ఆమె ఆరోగ్యం కోసం..

- 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' ప్రారంభం
- నేడు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో ప్రారంభం
- మెగా వైద్యశిబిరం ఏర్పాటు

ఇంటా బయట పని ఒత్తిడికి గురవుతున్న మహిళలు పోషకాహారలోపం, రక్తహీనతకు గురై పలు రకాల అనారోగ్యాలబారిన పడుతున్నారు. కుటుంబ బాగోగులను నిత్యం కనిపెట్టుకుని ఉండే మహిళలు అనారోగ్యంబారిన పడితే పిల్లల సంరక్షణ కుంటుపడటంతో మొత్తం కుటుంబమే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

- (ఆంధ్రజ్యోతి,మిర్యాలగూడ)

ఆరోగ్యవంతమైన మహిళలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్'ను జిల్లాలో మంగళవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ మేరకు జిల్లా స్థాయి అధికారులు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ చర్యలు చేపట్టనున్నారు. పోషకాహారం, ఆరోగ్య అవగాహన కోసం అంగన్‌వాడీల్లో పోషణ్ మహాన్‌తో జతచేసి ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు. ఆరోగ్యకరమైన కుటుంబాలను నిర్మించే దిశగా విస్తృత ప్రచారం కల్పించనున్నారు.

జిల్లా స్థాయి మెగా వైద్య శిబిరం

రాష్ట్ర ప్రభుత్వం 'ఆరోగ్య మహిళ.. శక్తివంతమైన కుటుంబం' కార్యక్రమం ద్వారా ఈ నెల 17న మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో జిల్లాస్థాయి మెగా వైద్య శిబిరం నిర్వహణకు ఏర్పాట్లు చేసింది. ఈఎన్‌టీ, కంటి, రక్తపోటు, దంత, మధుమేహం, క్యాన్సర్, గర్భిణులకు పరీక్షలు, రక్తహీనత, టీబీ, ఎనిమియా వంటి పరీక్షలను నిపుణులతో చేయించనున్నారు.

117 మహిళా ఆరోగ్య శిబిరాలు

ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహిస్తున్న 'ఆరోగ్య మహిళ.. శక్తివంతమైన కుటుంబం' కార్యక్రమం కింద మిర్యాలగూడ డివిజన్‌లో 35 వైద్య శిబిరాలు, జిల్లా వ్యాప్తంగా 117 వైద్య శిబిరాలను నిర్వహించనున్నారు. సబ్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్టులతో మహిళలకు, పిల్లలకు పరీక్షలు చేయించనున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరాల్లో పరీక్షలకు హాజరైన వారి పేర్లను

- మిగతా 8వ పేజీలో...

ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం..

మహిళలకు ఆరోగ్య సేవలతోపాటు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. స్థానికంగా లభించే ఆహారం గురించి తెలియజేసి ఏ రకాల పదార్థాలను తీసుకోవాలి, వేటికి దూరంగా ఉండాలనే విషయాలపై అవగాహన కల్పించనున్నారు. 10శాతం చక్కెర, వంట నూనెలను తగ్గించడం ద్వారా ఊబకాయాన్ని తగ్గించుకునే ఆలోచనలను పెంపొందించేందుకు వైద్యాధికారులు నిర్ణయించారు. రుతుస్రావ సంబంధ ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కల్పించి అందుకు అనుగుణంగా రోజువారీ మెనూలో చేపట్టాల్సిన మార్పులను వివరించనున్నారు. ఇంటికి రేషన్ పంపిణీకి సంబంధించిన సేవలను అందించేందుకు ప్రణాళికలను రూపొందించి అమలు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

రైతుల భూసమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించాలి

రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి సుధాకర్‌రెడ్డి



రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో పాల్గొన్న రెవెన్యూ, అటవీశాఖ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, జానారెడ్డి, తదితరులు

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పేద రైతులు ఎంతోకాలంగా సాగు చేసుకుంటున్న భూములపై వారికి హక్కులు కల్పించే అంశంలో సంబంధిత అధికారులు మానవీయ కోణంలో పరిష్కరించేలా చూడాని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రెవెన్యూ పైలట్ ప్రాజెక్టుపై మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డితో పాటు అటవీ, దేవాదాయశాఖమంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూశాఖ మంత్రి మాట్లాడుతూ, చిన్న సమస్యలను సాకుగా చూపించి రైతుల సమస్యలను జఠిలం చేయవద్దని అటవీశాఖ అధికారులకు సూచించారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో సుమారు 50 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న భూములపై గిరిజనులపై హక్కులను కల్పించే అంశంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. అయితే వివిధ నిబంధనలను చూపుతూ అటవీశాఖ అధికారులు కొర్రీలు పెడుతున్నారని, ఈ అంశంపై రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు సమన్వయంతో పనిచేసి వీలైనంత త్వరగా రైతుల సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

4వేల మందికి పట్టాలు

పైలట్ ప్రాజెక్టులో భాగంగా నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని తిరుమలగిరి(సాగర్) మండలాన్ని ఎంపిక చేసి గత ఆరు నెలలకు పైగా భూసర్వే నిర్వహించినట్టు మంత్రి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ క్రమంలో మండలంలో 235 సర్వే నెంబర్లను ఎంపిక చేశామని, 23వేల ఎకరాలను క్షేత్రస్థాయిలో సర్వే చేయగా, అందులో 12వేల ఎకరాలు ప్రభుత్వ భూమిగా గుర్తించామన్నారు. అందులో 8వేల ఎకరాలు సాగుకు అనుకూలంగా ఉన్నట్టు, 4వేల ఎకరాలకు రైతులు పట్టాదారు పాస్‌పుస్తకాలు పొంది సాగులో ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే మిగిలిన 4,037 ఎకరాలకు సంబంధించి పేద రైతులు భూములను సేద్యం చేసుకుంటున్నారని, త్వరలోనే వారికి పట్టాదారు పాస్‌పుస్తకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. మండలంలో సర్వే చేస్తున్న క్రమంలో 2,936 ఎకరాలకు సంబంధించి 3,069 మంది వద్ద బోగస్ పాస్‌పుస్తకాలు ఉన్నట్లు గుర్తించి వాటిని రద్దు చేయడంతోపాటు వారికి రైతుభరోసా, రైతు బీమా తదితర పథకాలు రాకుండా చూశామన్నారు. అదేవిధంగా సర్వేలో 7వేల ఎకరాల్లో అటవీ భూమిని గుర్తించామని, ఈ భూములకు సంబంధించి కూడా రెవెన్యూ, ఫారెస్ట్ అధికారుల సమన్వయంతో వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించి వాటిని సేద్యం చేస్తున్న రైతులకు కూడా న్యాయం చేస్తామని పేర్కొన్నారు. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, రెవెన్యూశాఖ కార్యదర్శి డీఎస్.లోకేష్‌కుమార్, పీసీసీఎఫ్ డాక్టర్ సి.సువర్ణ, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్‌తోపాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి



నల్లగొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిజాం రజాకార్ల కబంధ హస్తాల నుంచి హైదరాబాద్ సంస్థానం విడుదలైన రోజు సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఎంఐఎం పార్టీకి భయపడి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. కేవలం హిందూ పండుగలకు ఆంక్షలు విధిస్తూ తెలంగాణ విమోచన దినోత్సవం అనే పేరు చెప్పడానికి కూడా భయపడిన ప్రభుత్వం 'ప్రజా పాలన' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించడం దురదృష్టకరమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఐఎం పార్టీకి కొమ్ముకాయడమే పనిగా పెట్టుకొని హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఎందుకు నిర్వహించడం లేదో ప్రభుత్వం ప్రజలకు వివరించాలన్నారు.

పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించేలా సంబంధిత అధికారులు పనిచేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీకి స్థానిక పోలీస్‌స్టేషన్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ, వివిధ సమస్యలపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా ప్రవర్తించాలని, వారి సమస్యలను సానుకూలంగా విని పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా మండలంలో దొంగతనాలు జరగకుండా నిరంతరం గస్తీ నిర్వహించి శాంతిభద్రతలు కాపాడాలన్నారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రికార్డులు పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఐ వీరశేఖర్‌ను ఆదేశించారు. నూతన స్టేషన్ నిర్మాణానికి తగిన స్థలం గురించి ఆరాతీశారు. అదేవిధంగా రిసెప్షన్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఉమెన్ కానిస్టేబుల్ ఇంద్రజతో పాటు హెడ్‌కానిస్టేబుల్ అలీఅహ్మద్, కానిస్టేబుళ్లు అనిల్, రవికుమార్, సాయికుమార్, హేమంత్‌కుమార్, నాగరాజును అభినందించారు. ఆయన వెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ శ్రీనునాయక్, ఎస్ఐ వీరశేఖర్, తదితరులు ఉన్నారు.

నేడు 'ప్రజా పాలన' దినోత్సవం



ముస్తాబైన పోలీస్ పరేడ్ గ్రౌండ్

నల్లగొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ 'ప్రజా పాలన' దినోత్సవాన్ని నిర్వహించేందుకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. బుధవారం వేడుకల్లో భాగంగా ఉదయం 10గంటలకు రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి ప్రసంగిస్తారు. 10.30గంటలకు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

డీపీవో వెంకయ్య



అంతంపేట పంచాయతీ కార్యాయలంలో బ్లీచింగ్ పౌడర్‌ను పరిశీలిస్తున్న డీపీవో వెంకయ్య

గట్టుప్పల్, మునుగోడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పంచాయతీ కార్యదర్శులను డీపీవో వెంకయ్య ఆదేశించారు. మంగళవారం గట్టుప్పల్ మండల పరిధిలోని అంతంపేట, వెల్మకన్నె గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలను మునుగోడు మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్, గ్రామపంచాయతీ, ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాన్ని తనిఖీ చేశారు. అంతంపేట, వెల్మకన్నెలో రికార్డులతో పాటు, స్టోర్ రూమ్‌లో ఉన్న బ్లీచింగ్ పౌడర్‌ను పరిశీలించారు. రికార్డులు సరిగా లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కార్యదర్శులు సమయపాలన పాటించకుంటే, పని విధానంలో మెరుగు కనిపించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మునుగోడు హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య, నిర్వహణ తీరును వార్డెన్ వెంకన్నను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి భోజన మెనూపై ఆరాతీశారు. గ్రామపంచాయతీ, పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డికి సూచించారు. ఆయన వెంట గట్టుప్పల్ ఎంపీడీవో వసంత లక్ష్మి ఉన్నారు.

నేడు సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ జిల్లా కేంద్రంలోని సుభాష్ సెంటర్లో నిర్వహిస్తామని, ఈ కార్యక్రమానికి సీపీఎం పొలిట్ బ్యూరో మాజీ సభ్యురాలు బృందా కరత్ హాజరవుతారని సీపీఐఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర నేత ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక దొడ్డికొమరయ్య భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 40 కేంద్రాల్లో అమరుల స్థూపాల వద్ద నివాళులర్పించి ర్యాలీలు నిర్వహించామన్నారు. వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, నాయకులు చెరుపల్లి సీతారాములు, తదితరులు పాల్గొంటారని తెలిపారు. విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున, నారి ఐలయ్య, చినపాక లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉట్టి కొట్టే కార్యక్రమం

చింతపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడకొండ్లలోని వేణుగోపాల స్వామి ఆలయంలో మంగళ వారం ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ సమీపంలో యాదవులు ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ అల్వాల జంగయ్యగౌడ్, ఆలయ ప్రధాన అర్చకుడు వైద్యుల ప్రవీణ్‌కుమార్‌శర్మ, ధర్మకర్తలు ఇడుకుళ్ల రాంమోహన్, కడారి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అసత్యాలు ప్రచారం చేయొద్దు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అసత్యాలను ప్రచారం చేయొద్దని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గన్‌మెన్ యూరియా లారీ అక్రమంగా తరలించలేదని అధికారులు ధ్రువీకరించిన నేపథ్యంలో బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేయడం ఆపాలని హితవు పలికారు. యూరియా సరఫరాలో ఎలాంటి అవకతవకలు జరగలేదని దళిత సంఘ నేత ఉబ్బపల్లి కాశయ్య అన్నారు.

వన మహోత్సవం.. కుదరని ముహూర్తం

» వర్షాలు ఒడిసిపోతున్నా ప్రారంభకాని కార్యక్రమం
» సకాలంలో నాటితేనే ఉపయోగమంటున్న పర్యావరణ ప్రేమికులు


మునిసిపల్ అధికారులతో కలిసి మొక్క నాటుతున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్ (ఫైల్)

పచ్చదనం పెంపునకు ప్రతిఏటా జిల్లావ్యాప్తంగా లక్షలాది మొక్కలు నాటుతున్నారు. ఈ ఏడాది వనమహోత్సవానికి ముహూర్తం కుదరడం లేదు. వర్షాలు కురిసినా, వాగులు పొంగినా, వరదలు పారినా.. మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవడం లేదు. జూలై, ఆగస్టు మాసాల్లో చెప్పుకోదగిన అంటే సాధారణానికి మించిన వర్షాలు కురిసాయని నివేదికలు సూచిస్తుండగా అధికారులు మాత్రం మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందించలేదు.

- ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్

వనమహోత్సవం నిరంతర కార్యక్రమమని, ప్రతి ఏటా కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశించాన అధికార యంత్రాంగం అందుకనుగుణంగా చర్యలు చేపట్టడం లేదు. ప్రతి సీజన్‌లో జూన్, జూలైలోనే మొక్కలు నాటాల్సి ఉంటుంది. జూన్ మాసంలో ఎండల తీవ్రత తగ్గకపోవడంతో ఈ ఏడాది జూలై, ఆగస్టు మాసాలలో మొక్కలు నాటాలని నిర్ణయించింది ప్రభుత్వం. ప్రభుత్వ స్థలాలు, ఉద్యాన వనాలు, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షించాలి. అదేవిధంగా స్కూళ్లు, కమ్యూనిటీ సెంటర్లు, ఆస్ప త్రులు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాట డంతో పాటు ఆసక్తి గల వారు ఇళ్లు, పెరట్లలో మొక్కలు నాటుకునేందుకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేయాల్సి ఉండగా పట్టించుకునే వారేలేరని పర్యావరణ ప్రేమికులంటున్నారు.

జిల్లాలో 844 నర్సరీలు

జిల్లావ్యాప్తంగా ఉన్న 844 నర్సరీలుండగా, ఆయా నర్సరీల్లో సుమారు కోటిన్నర మొక్కలు అందుబాటులో ఉన్నాయి. వన మహోత్సవంలో 59 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకుంది జిల్లా యంత్రాంగం. నాటేందుకు 68.70లక్షల మొక్కలు సిద్ధం చేసింది. మునిసిపల్, పంచా యతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖల అధ్వర్యంలో ఊరూరా వన మహోత్సవం నిర్వహించాల్సి ఉంది. ప్రభుత్వ శాఖలతో పాటు స్వచ్ఛంద సంస్థలు, యువజన, మహిళ సంస్థల సహకారంతో చేపట్టాల్సి ఉంది.

సకాలంలో నాటితేనే ఉపయోగం



వర్షాలు కురుస్తున్న తరుణంలోనే వనమహోత్సవం నిర్వహించాలి. సకాలంలో నాటితేనే ఉపయోగకరంగా ఉంటుంది. వర్షాలు కురుస్తున్న తరుణంలో నాటితే అవి భూమిలో ఇమిడి నాటిన మొక్కలన్నీ బతుకుతాయి. ప్రతీ సీజన్‌లో మొక్కలు నాటుతాను. విత్తనాలు సేకరించి స్వయంగా తయారు చేసిన వేప, చింత తదితర రకాల మొక్కలను రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తాను. మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

- శ్రీనివాస్, పర్యావరణ ప్రేమికుడు, మిర్యాలగూడ.

వన మహోత్సవం నిరంతర ప్రక్రియ



మునిసిపాలిటీ పరిధిలో వన మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. మొక్కలు సైతం సిద్ధంగా ఉండగా, ఉద్యమంలా మొక్కల పండుగ జరుపుతాం. ఇకపై సీజన్ వారీగా కాకుండా నిరంతర ప్రక్రియగా మొక్కల పెంపకం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. మొక్కల పెంపకానికి మునిసిపాలిటీకి ప్రత్యేకంగా రెండు నర్సరీలను ఏర్పాటు చేస్తున్నాం.

- శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ.

మెనూ సక్రమంగా పాటించాలి : ఆర్డీవో


సామగ్రి పరిశీలిస్తున్న ఆర్డీవో

దేవరకొండ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్టీ బాలికల గురుకుల పాఠ శాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి కోరారు. మంగళవారం తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డితో కలిసి గిరిజన బాలికల వసతిగృహన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలను అ డిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వంట గదులను పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వార్డెన్‌ను కోరారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు.

డ్రైనేజీ మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయాలి

వేములపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ సమీపంలో దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ కాల్వ మ్యాన్ హోల్‌కు మరమ్మతులు చేయించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు పుట్టల సందీప్ కోరారు. మంగళవారం ఎంపీడీవో జితేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. నెల రోజులుగా మ్యాన్‌వల్ పనులకు మరమ్మతులు చేపట్టకపోవడంతో నిత్యం ఇదే మార్గం గుండా ఎంఈవో, పోలీస్‌స్టేషన్, గ్రామపంచాయతీ కార్యాలయాలకు, బస్టాండ్ సెంటర్‌లకు వచ్చే పాదా చారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

పౌష్టికాహారం అందించాలి

హాలియా, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం అందించాలని సీడీపీవో ఉదయశ్రీ అన్నారు. మంగళవారం అనుముల మండల ఎంపీడీవో కార్యాలయంలో అనుముల ప్రాజెక్టు పరిధిలోని హాలియా, నిడమనూరు అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు ప్రతి బిడ్డకు పోషణ, చదువుపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ రమాదేవి, సైదాబేగం, సరిత, ఫరీదాబేగం, బీసీ పవన్, సైదులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చింతపల్లి: నాంపల్లి, మర్రిగూడ, చింతపల్లి సెక్టార్ల అంగన్‌వాడీ టీచర్లకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ బీ.. పడాయి బీ ట్రైనింగ్‌లో భాగంగా శిక్షణ నిర్వహిస్తున్నారు. సూపర్‌వైజర్ సుగుణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు బోధనతో పాటు పౌష్టికాహారం ఆటపాటలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, అంజమ్మ,బ్లాక్ కోఆర్డినేటర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

హాలియా, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని పల్‌రెడ్డి ఫౌండేషన్ డైరెక్టర్ పల్‌రెడ్డి నర్సింహారెడ్డి అన్నారు. అనుముల మండలంలోని కొత్తపల్లి, అనుముల, హాలియా, అలీనగర్, చింతగూడెం పాఠశాలలో ఫౌండేషన్ అధ్వర్యంలో గురుకుల మెటీరియల్ పంపిణీ చేశారు. విద్యార్థులు మెటీరియల్స్‌ను ఉపయోగించుకొని చదువుకోవాలని సూచించారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే బాలునాయక్


టీపీసీసీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

దేవరకొండ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడిగా సంవత్సరం పూర్తి చేసుకున్న మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ మంగళవారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గత ఏడాది కాలంలో పార్టీని బలోపేతం చేసే దిశగా పీసీసీ అధ్యక్షుడు చూపిన కృషి ప్రతి కార్యకర్తకు అందించిన భరోసా కాంగ్రెస్ పార్టీకి మరింత శక్తిని ఇచ్చాయన్నారు. పాదయాత్రల నుంచి ప్రజా సమస్యల వరకు ప్రతి ఉద్యమంలో పోరాట పటిమను కనబర్చిన తీరు స్ఫూర్తిదాయకమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహేష్‌కుమార్‌గౌడ్ మార్గదర్శకంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు.

ఫొటో ఎక్స్‌పోను విజయవంతం చేయాలి

కొండమల్లేపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని నార్సింగ్‌లో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించే ఫొటో ఎక్స్ పోను విజయవంతం చేయాలని ఫొటో గ్రాఫర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి కృష్ణ కోరారు. మంగళవారం కొండమల్లేపల్లిలో ఫొటో ఎక్స్ పోకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సమడం జయరాం, మేదరి భాస్కర్, నక్క జానయ్య, సయ్యద్ పాషా, యాదగిరి, సందీప్‌కుమార్, రమేష్, వెంకట్, మురళీ, దీప్లా, పాషా, రామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది


సన్మానం పొందిన ఉపాధ్యాయులు

పెద్దఅడిశర్లపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో మాట్లాడారు. భావి భారత పౌరులను తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ విద్యార్థుల ఉన్నతికి మరింతగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు వెంకటయ్య, సముద్రాల శ్రీనయ్య, కార్యక్రమ నిర్వాహకుడు పాల్వాయి రంగారెడ్డి, పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్షకార్యదర్శులు కె.మూనా, అనిల్‌కుమార్, జిల్లా కార్యదర్శి రవికుమార్, టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షుడు జీవన్‌కుమార్, జిల్లా కార్యదర్శి చిన్న వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆస్తులను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న మల్లు గౌతంరెడ్డి

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఆస్తులను కాపాడుకోవాల్సిన అవసరముందని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) సంఘ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ మల్లు గౌతంరెడ్డి అన్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం జెండా ఆవిష్కరించారు. అధికారులు, ఉద్యోగులు, కార్మికులందరి కష్టంతో ఆర్టీసీ సంస్థ అంచెలంచెలుగా ఎదిగిందని, ఆస్తులు సమకూర్చుకుందన్నారు. ఆయా ఆస్తుల నగదీకరణను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రయాణికులకు నాణ్యమైన సేవలందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టిన ఆర్టీసీ సంస్థలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టడం ఆహ్వానించదగిన పరిణామమేనని, అయితే ఆయా బస్సులను సంస్థ ఉద్యోగులకు అప్పగించాలన్నారు. కార్మికులకు అందాల్సిన అలవెన్సులు అందించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాలను విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు తాళ్లపల్లి వినయ్‌కుమార్, కార్యదర్శి పీ. కృష్ణయ్య, కోశాధికారి రాములు, ప్రచార కార్యదర్శి బాలయ్య, యూటీఎఫ్ సీనియర్ నేత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నియోజకవర్గస్థాయి పోటీలు


క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీనివాస్ తదితరులు

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 18, 19వ తేదీల్లో నియోజకవర్గ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో కె. శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం పాఠశాల మైదానాన్ని పరిశీలించి మాట్లాడారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ సెక్రటరీ ఎం.సత్యనారాయణ, పీడీలు వెంకటరామిరెడ్డి, యుగంధర్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, మురళీ, లచ్చయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి, లావణ్య, సీనియర్ క్రీడాకారులు శాకం పెద్దిరెడ్డి, శాకం నారెడ్డి, నరసింమారావు, గాలిబ్ సాహెబ్ తదితరులు ఉన్నారు.

నైజాం వ్యతిరేక పోరాటంలో బీజేపీ పాత్రలేదు


చందంపేట : ముడుదండ్లలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

చందంపేట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తూం బుచ్చిరెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా మండలంలోని ముడుదండ్ల, గన్నేర్లపల్లి, గుంటిపల్లి, పోలేపల్లి గ్రామాల్లో అమరుల స్మారక స్థూపాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూమి కోసం, భుక్తి కోసం, తెలంగాణ విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సాయుధ పోరాటం చేసి నిజాం, నియంత పాలన నుంచి దొరలు, భూస్వాముల అరాచకాల నుంచి తెలంగాణను విముక్తి చేసిన అమరవీరులకు జోహార్లు అర్పించారు. నైజాం వ్యతిరేక పోరాటంలో బీజేపీ పాత్ర ఏమీలేదని ప్రజలను మభ్యపెట్టేందుకే విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎండీ. మైనొద్దిన్, అంజనేయులు, ఉప్పునూతల వెంకటయ్య, వెంగలయ్య, జూలూరి మహేష్ పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని బీజేపీ పార్టీ మతం రంగు పులిమి చరిత్రను వక్రీకరిస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ అన్నారు. బీజేపీ వైఖరిని నిరసిస్తూ మంగళవారం మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టి మాట్లాడారు. తెలంగాణ ప్రాంతంలో ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేసిన నిజాం, రజాకార్లను ఎదురొంచిన ఘనత కమ్యూనిస్టు పార్టీకే దక్కుతుందన్నారు. దున్నే వాడికి భూమి అనే నినాదంతో నాడు పేదలకు 10లక్షల ఎకరాలను పంచిన ఘనత కమ్యూనిస్టులదేనన్నారు. అలాంటి మహత్తర పోరాటాన్ని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు హిందూ, ముస్లిం మధ్య జరిగిన గొడవగా చిత్రీకరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో అశోక్‌రెడ్డి, పుల్లెంల శ్రీకర్, కుర్ర ఎల్లయ్య, మల్లయ్య, కృష్ణయ్య, భూపతిరెడ్డి, నాగయ్య, రవి, నర్సిరెడ్డి, మాధవరెడ్డి, యాదయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మునిసిపల్ కమిషనర్ గుణవేణి శ్రీనివాస్ అన్నారు. అధికారులు, ఉద్యోగులు, జవాన్లతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పౌరసేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. కార్యాలయ వేళల్లో అందుబాటులో ఉండాలని, ఎవరికి కేటాయించిన విధులను వారే నిర్వర్తించాలన్నారు. బతుకమ్మ, దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో జవాన్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. వీధిలైట్లు, పారిశుధ్య పనులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో అధికారులు వెంకన్న, జ్ఞానేశ్వరి, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

భావోద్వేగాలకు గురికావొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భావోద్వేగాలకు గురికావొద్దని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పోకల వెంకటేశ్వర్లు అన్నారు. ఆత్మహత్యల నివారణపై పట్టణంలోని పారా మెడికల్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆర్థిక సమస్యలు, మానసిక ఒత్తిడి, అవమానాలు, వేధింపులు, నిందలతోనే బలవన్మరణాలు జరుగుతున్నాయన్నారు. చిన్న కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడటం ఆందోళన కలిగిస్తోందన్నారు. మానసిక ప్రశాంతత అలవర్చుకోవాలని, సాకుకూల ధృక్పదాన్ని పెంచుకుని, క్రమశిక్షణ గల జీవన విధానం సాగించాలన్నారు. జనయేత్రి ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మునీర్ మాట్లాడుతూ మరణించి సాధించేదేమీ లేదన్నారు. ఒత్తిడిని అధిగమించాలంటే వ్యాయామం, ధ్యానం, యోగా సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ స్రవంతి, డైరెక్టర్ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

చింతపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఫలితాల కోసం విద్యార్థులు కృషి చేయాలని తీదేడు జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం గంధం సురేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని వెంకటంపేట (తీదేడు) జడ్పీహెచ్ఎస్‌లో హింది భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.సమాజంలో ప్రతి ఒక్కరూ తెలుగుతో పాటు హిందీ భాషాపై కూడా పట్టుకలిగి ఉన్నప్పుడే ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు సులభంగా ఉంటుందన్నారు. పదో తరగతికి చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తే తీదేడు గ్రామానికి చెందిన దివంగత ఆర్ఎంపీ వైద్యుడు వైద్యుల చలపతిరావు జ్ఞాపకార్థం బంగారు పతకాలతో పాటు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ఆయన కుమారుడు కృష్ణమూర్తిశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సీహెచ్ పద్మ, శ్రీరాములు, జి.దేవ్‌కుమార్, విష్ణుకాంత, పాల్వాయి వాసుదేవ రెడ్డి, లలిత, తదితరులు పాల్గొన్నారు.


కృష్ణమూర్తిని సన్మానిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి : ఏఎస్పీ


పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ సామాగ్రిని పరిశీలిస్తున్న ఏఎస్పీ మౌనిక

చందంపేట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ మౌనిక అన్నారు. చందంపేట పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని కేసుల వివరాలను, రికార్డులను, ఆయుధ సామాగ్రిని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో డిండి సీఐ బీసన్న, చందంపేట ఎస్ఐ లోకేష్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరకు యూరియా విక్రయిస్తే చర్యలు

పెద్దఅడిశర్లపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): యూరియా కొరత పేరుతో రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని డివిజన్ వ్యవసాయ అధికారి శ్రీలక్ష్మీ అన్నారు. మంగళవారం మండలంలోని దుగ్యాల గ్రామంలోని శ్రీసాయి హనుమాన్ ఫర్టిలైజర్ షాపును ఏవో పాండుతో కలిసి తనిఖీ చేశారు. షాపు యాజమాని ఈ నెల 6వ తేదీన 444 బస్తా యూరియాను కొంత మంది రైతులకు నిర్ధేశించిన ధరకు మించి అధిక ధరకు విక్రయించినట్లు ఫిర్యాదు రావడంతో అధికారులు మంగళవారం షాపును తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం షోకాజ్ నోటీస్‌లు జారీ చేసి షాపును సీజ్ చేశారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత


ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వ్యక్తి కుటుంబసభ్యులకు ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి మిర్యాలగూడలోని తన కార్యాలయంలో మంగళవారం ఎల్‌వోసి అందజేశారు. మండలంలోని బోయగూడెం గ్రామానికి చెందిన మారయ్య అనారోగ్యంతో బాధపడుతూ హైద్రాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎమ్మెల్సీ కోటిరెడ్డి బాధిత కుటుంబానికి రూ.1.50లక్షల ఎల్‌వోసి చెక్కును మంజూరు చేయించి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, నాయకులు బొడ్డుపల్లి మురళీ తదితరులు ఉన్నారు.

ఆమె ఆరోగ్యం కోసం..

(5వ పేజీ తరువాయి)

నమోదుచేసి రోగనిర్ధారణ జరిగితే వారికి అన్ని రకాల సేవలు అందించేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఈ మేరకు క్యాంపుల నిర్వహణకు వైద్యఆరోగ్యశాఖ అధికారులు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. వైద్య శిబారాల్లో నిర్వహించే వైద్య పరీక్షలకు మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూసేందుకు గ్రామకార్యదర్శులు, ఆశావర్కర్ల ద్వారా గ్రామాల్లో ప్రచారం నిర్వహించనున్నారు. ప్రజల భాగస్వామ్యం కోసం రక్తదాన శిబిరాల నిర్వహణ, అవయవ దాతల పేర్ల నమోదు ప్రక్రియను కూడా చేపట్టనున్నారు.

ఆరోగ్య సేవలు సులభంగా అందేందుకు

వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రభుత్వం అందించే సేవలను సులభంగా పొందేందుకు ప్రత్యేక విధానాల అమలుకు అధికారులు చర్యలు చేపట్టారు. మాతాశిశు సంరక్షణ కార్డు జారీ చేయడం ద్వారా ఇరువురికి ఆరోగ్య సేవలు అందించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ప్రధానమంత్రి 'మాతృ వందనం' కార్యక్రమంలో పేర్ల నమోదు సికిల్‌సెల్ కార్డుల నిర్వహణ, పోషణ్ ట్రాకర్‌లో లబ్ధిదారుల పేర్లను నమోదు చేయడం ద్వారా ఆరోగ్య సేవలను సజావుగా అందించే వీలుగా కార్యాచరణ అమలు చేయనున్నారు.

మెగా వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి



మహిళా ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు నిర్వహిస్తున్న మెగా వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో ఉదయం 9గంటల నుంచి పలు రకాల వ్యాధులకు ప్రత్యేక వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహిస్తారు. ఆశా కార్యకర్తలు మహిళలకు, గర్భిణులకు ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించాలి. అక్టోబరు 2 వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలి.

● కేస రవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో

సినిమా గైడ్: మిర్యాలగూడ: శ్రీనివాస : కిష్కింధపురి, వెంకటేశ్వర: లిటిల్ హార్ట్స్ రాఘవ: మదరాసి, విట్రోస్: కిష్కింధపురి, లిటిల్ హార్ట్స్, మిరాయ్, కొత్తలోక దేవరకొండ : మనోజ్ : వార్ 2 మైత్రి వెంకటేశ్వర : కూలీ